శుక్రవారం
06-10-2023
విజయవాడ ప్రచురణ
సంపుటి : 72, సంచిక : 106
పేజీలు : 8, వెల: రూ.5.00
Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam

www.visalaandhra.com
స్థాపితం : 1952

విశాలాంధ్ర

VISALAANDHRA Regd No.VJ/042/2021-23
అక్షరాక్షరం అభ్యుదయం

పోరాటాల్లో కలిసి రండి

గ్రీస్‌లో ఆదివారం (8వ తేదీ) స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. దీంతో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దేశవ్యాప్తంగా ర్యాలీలు, సభలు నిర్వహిస్తోంది. ఇప్పటికే థెస్సలోనికి, లామియా, లారిస్సా, నియా ఐయోనియా (ఏథెన్స్), నిక్రైయ (పిరేసెస్) తదతర నగరాల్లో ఎన్నికల ర్యాలీలలో కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్సోంబస్ ప్రసంగించారు.

2 లో

జాన్ ఫోస్సెకు 'సాహిత్య' నోబెల్

స్టాక్‌హోమ్: నార్వేకు చెందిన రచయిత జాన్ ఫోస్సెను సాహిత్యంలో నోబెల్ పురస్కారం వరించింది. మాటల్లో చెప్పలేని అనేక అంశాలకు తన వినూత్న నాటకాలు, గద్యాల ద్వారా గళమిచ్చిన రచయిత జాన్ ఫోస్సె అని స్వీడిష్ అకాడమీ ప్రశంసించింది. ఫోస్సెకు సాహిత్య విభాగంలో నోబెల్ పురస్కారాన్ని గురువారం ప్రకటించింది. జాన్ ఒలావ్ ఫోస్సె 1959లో నార్వేలోని హేగ్‌సండ్ ప్రాంతంలో జన్మించారు. అనేక నాటకాలు, నవలలు, పొట్టి కథలు, కవిత్వాలు, పిల్లల పుస్తకాలు రాశారు. ఈయన రచించిన నోకోన్ కెజెమ్ టిల్ ఎ కామ్మె (ఎవరో రాబోతున్నారు) అనే నాటకం 1999లో తొలిసారి ప్రదర్శించారు. చిన్నతనం నుంచే సాహిత్యంపై ఆసక్తి పెంచుకున్న ఫోస్సె 1983లో 'రెడ్, బ్లాక్' పేరుతో తొలి నవల రాశారు. అనేకఅద్భుత రచనలు చేశారు. గద్యరచన ద్వారా ప్రపంచ ఖ్యాతిగాంచారు. మానవ జీవన స్థితిగతులు, రోజువారీ సంఘటనలపై గద్యాలు, నాటకాలు రాయడం ఆయన ప్రత్యేకత. ఫోస్సె రచనా శైలి 'ఫోస్సె మినిమలిజం'గా స్వీడిష్ అకాడమీ వర్ణించింది. 1901 నుంచి 119 మంది సాహిత్యవేత్తలు నోబెల్ పురస్కారాన్ని అందుకోగా ఇందులో 17 మంది మాత్రమే మహిళలు ఉన్నట్లు అకాడమీ తెలిపింది. కాగా, ఈ అవార్డును గతేడాది ఫ్రెంచ్ రచయిత యానీ ఎర్నాక్స్ అందుకున్నారు.

చంద్రబాబు రిమాండ్ 19 వరకు పొడిగింపు

బెయిల్, కస్టడీ పిటిషన్‌లపై విచారణ నేటికి వాయిదా

ఫైబర్‌నెట్ కేసులో బెయిల్‌పై హైకోర్టు తీర్పు రిజర్వు

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం కేసులో అరెస్టయిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు రిమాండ్‌ను ఏసీబీ కోర్టు అక్టోబరు 19 వరకు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. రాజమహేంద్రవరం జైలులో ఉన్న చంద్రబాబుకు రెండో దఫా విధించిన రిమాండ్ గడువు గురువారంతో ముగిసింది. దీంతో చంద్రబాబును జైలు అధికారులు వర్చువల్‌గా జడ్జి ఎదుట హాజరుపరిచారు. మరోవైపు జ్యుడిషియల్ రిమాండ్ పొడిగించాలంటూ ఏసీబీ కోర్టులో సీఐడీ మెమో దాఖలు చేసింది. దీనిని పరిగణనలోకి తీసుకున్న ఏసీబీ కోర్టు జ్యుడిషియల్ రిమాండ్‌ను రెండు వారాల పాటు పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. మరోవైపు ఇదే కేసులో చంద్రబాబు దాఖలు చేసిన బెయిల్ పిటిషన్, సీఐడీ దాఖలు చేసిన కస్టడీ పిటిషన్‌పై విచారణ మళ్లీ వాయిదా పడింది. శుక్రవారం మధ్యాహ్నం రెండు పక్షాల వాదనలు వింటామని ఏసీబీ కోర్టు వెల్లడించింది. ఈ రెండు పిటిషన్లపై రెండు రోజులపాటు ఇప్పటికే సుదీర్ఘంగా వాదనలు కొనసాగాయి. చంద్రబాబు తరపున సుప్రీంకోర్టు న్యాయవాది ప్రమోద్‌కుమార్ దూబే, సీఐడీ తరఫున అదనపు ఏజీ పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపించారు.

ముందస్తు బెయిల్‌పై తీర్పు రిజర్వ్

ఫైబర్‌నెట్ కేసులో చంద్రబాబు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును హైకోర్టు రిజర్వ్ చేసింది. చంద్రబాబు తరపున సీనియర్ న్యాయవాదులు సిద్దార్థ లూథ్రా, సిద్ధార్థ అగర్వాల్, రాష్ట్ర ప్రభుత్వం తరపున ఏజీ శ్రీరామ్ వాదనలు వినిపించారు. ప్రభుత్వ విధాన నిర్ణయాలకు చంద్రబాబును బాధ్యుడిని చేయడం సరికాదని ఆయన తరపు న్యాయవాదులు



వాదించారు. రాజకీయ కక్షతో మాత్రమే కేసు నమోదు చేశారని వివరించారు. రెండేళ్ల క్రితం కేసుపెట్టి చంద్రబాబుకు నోటీసులు ఇవ్వలేదని, హఠాత్తుగా ఆయన పేరు చేర్చారని న్యాయస్థానం దృష్టికి తీసుకొచ్చారు. ఈ పిటిషన్‌పై బుధవారం కూడా వాదనలు జరిగాయి. పూర్తిస్థాయిలో వినేందుకు తగిన సమయం లేకపోవడంతో విచారణను న్యాయమూర్తి గురువారానికి వాయిదా వేశారు. సిద్ధార్థ అగర్వాల్ వాదనలు వినిపిస్తూ టెరాసాఫ్ట్ సంస్థకు టెండర్ ఖరారు విషయంలో సాంకేతిక కమిటీ, టెండర్ అవార్డు కమిటీలో చంద్రబాబు సభ్యుడిగా లేరన్నారు. విధానపరమైన నిర్ణయాల అమలు విషయంలో కొందరు చేసిన తప్పులకు, ఆర్థిక అక్రమాలకు, లోపాలకు అప్పటి ముఖ్యమంత్రిని బాధ్యుడిని చేయడం సరికాదన్నారు. రాజకీయంగా బలమైన ప్రత్యర్థిగా ఉన్న పిటిషనర్‌ను కారాగారంలో ఉంచాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోందన్నారు. దురుద్దేశంతో తప్పుడు కేసులో ఇరికించారని వాదించారు. ఇద్దరి వాదనలు విన్న ధర్మాసనం ముందస్తు బెయిల్ పిటిషన్‌పై తీర్పును రిజర్వ్ చేసింది.

ఆదుకోండి

- పోలవరం నిధులు, బకాయిలు ఇవ్వాలని నిర్మలమ్మకు వినతి
- అమలుకు నోచుకోని విభజనాంశాల ప్రస్తావన
- తెలంగాణ నుంచి విద్యుత్ బకాయిలపై మంత్రి సింగ్‌కు విజ్ఞప్తి
- నేడు మోదీ, అమిత్‌షాతో భేటీ కానున్న సీఎం జగన్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి : ఆర్థికంగా కష్టాల్లో ఉన్న ఏపీని అన్నివిధాలా ఆదుకోవాలని ముఖ్యమంత్రి జగన్‌మోహన్ రెడ్డి కేంద్ర మంత్రులకు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల ఢిల్లీ పర్యటనకు వెళ్లిన సీఎం గురువారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌ను కలిశారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి రావల్సిన బకాయిలు ఇప్పించాల్సిందిగా ఇద్దరు మంత్రులకు ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. పోలవరం ప్రాజెక్టు ఏపీకి అత్యంత కీలకమైనదని, దీనికి రాష్ట్ర ప్రభుత్వం ఖర్చు పెట్టిన నిధులతో పాటు, పునరావాస ప్యాకేజీ కింద ఇవ్వాల్సిన నిధులను సాధ్యమైనంత త్వరగా విడుదల చేయాలని కోరారు. త్వరలో ఎన్నికలు సమీపిస్తున్నందున సమస్య తీవ్రతను అర్థం చేసుకుని నిధుల విడుదలకు చర్యలు తీసుకోవాలని ఆర్థికమంత్రికి విజ్ఞప్తి చేశారు. విభజన అంశాల్లో ఇంకా అమలుకు నోచుకోని అంశాలను, ప్రస్తుతం అమలవుతున్న ప్రాజెక్టులకు త్వరితగతిన నిధులు విడుదల చేయాలన్నారు. అనంతరం కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి ఆర్కే సింగ్‌తో భేటీ అయ్యారు. తెలంగాణ రాష్ట్రం నుంచి రావల్సిన విద్యుత్ బకాయిలు, ఇతర అంశాలపై మంత్రి సింగ్‌తో సీఎం దాదాపు గంటపాటు చర్చించారు. ఈ సందర్భంగా ఏపీలో విద్యుత్ రంగ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని కేంద్ర మంత్రి ప్రశంసించారు. విద్యుత్ రంగంలో ఆంధ్రప్రదేశ్ చాలా బాగా పనిచేస్తోంది. ఆర్డీఎస్ఎస్ రీ వ్యాంప్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీమ్‌కి సంబంధించి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తోంది. ఈ పథకానికి ఏపీ అర్హత పొందిందని మంత్రి సింగ్ ముఖ్యమంత్రికి చెపుతూ అభినందనలు తెలిపారు. ఈ పర్యటనలో సీఎం జగన్ వెంట పార్లమెంటు సభ్యులు విజయసాయిరెడ్డి, మిథున్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ ప్రధానకార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి ఉన్నారు. ఉదయం గన్నవరం విమానాశ్రయం నుంచి ఢిల్లీ వెళ్లిన ముఖ్యమంత్రికి అక్కడ విమానాశ్రయంలో వైసీపీ ఎంపీలు పై వారితోపాటు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, భరత్, రెడ్డప్ప, అయోధ్య రామిరెడ్డి, బాలశౌరి, గోరంట్ల మాధవ్, రంగయ్య తదితరులు ఘనస్వాగతం పలికారు. శుక్రవారం ఉదయం ఢిల్లీలో ' వామపక్ష తీవ్రవాదం నిర్మూలన' అంశంపై జరుగుతున్న సదస్సులో సీఎం జగన్ పాల్గొననున్నారు.

మోదీ ఎన్నికల ఎర



- నీటి హక్కుల పునఃసమీక్షకు సిద్ధం
- తెలంగాణ ప్రయోజనాలకు యత్నం
- రాయలసీమపై వివక్ష
- కేంద్రం చేతిలో కీలుబొమ్మగా రాష్ట్ర ప్రభుత్వం

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు అడుగడుగునా అన్యాయం చేస్తోంది. విభజన హామీలకు తూట్లు పొడుస్తోంది. ప్రత్యేక హోదా ప్రస్తావనే తేవడంలేదు. నీటి వాటాల పునఃసమీక్షతో ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు అన్యాయం చేస్తోంది. ఎన్నికల స్వార్థం కోసం బరి తెగిస్తోంది. రాయలసీమ సాగునీటి అవసరాల హక్కులను కాలదన్నింది. కర్నాటక ఎన్నికలలో లబ్ధి పొందటానికి తుంగభద్ర డ్యామ్ పై భాగంలో నిర్మిస్తున్న ఎగువభద్రను అడ్డుకోకుండా దానిని జాతీయ ప్రాజెక్టుగా ప్రకటించి బడ్జెట్లో రూ.5300కోట్లు కేటాయించింది. ఎగువభద్ర మొదటి రెండు దశల్లో 48 టీఎంసీల నీటిని తుంగభద్రకు రాకముందే తోడేసుకోవచ్చు. అంటే రాయలసీమ ప్రయోజనాలు పూర్తిగా దెబ్బతింటాయి. ఇదే విషయమై ఆ ప్రాంత ప్రజలలో ఆందోళన ఉంది. రాయలసీమ విషయంలో బీజేపీ మొసలికన్నీరు కారుస్తోంది. ఈ దురాగతాన్ని అడ్డుకోవల్సిన రాష్ట్రప్రభుత్వం ఆ పని చేయలేదు. కేంద్రం చేతిలో కీలుబొమ్మగా మారింది. ఈ బలహీనతను మోదీ ప్రభుత్వం అవకాశంగా తీసుకుంది. ఈనెల 4న జరిగిన కేంద్ర కేబినెట్‌లో కృష్ణా జలాల పునఃసమీక్షకు అంగీకారం తెలిపింది. బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌కు కొత్త నిబంధనల పరిశీలనా బాధ్యత అప్పగిస్తూ తీర్మానించింది.

నీటి వాటాలపై పునః సమీక్ష

బచావత్ ట్రిబ్యునల్ ప్రకారం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టీఎంసీల నీటిలో ఆంధ్రప్రదేశ్ వాటా 512 టీఎంసీలు. అనేక సంవత్సరాలుగా వాడుకుంటున్న హక్కు పునఃసమీక్షకు సిద్ధమైంది. తెలంగాణలో చట్టవిరుద్ధంగా 255 టీఎంసీల నిలువతో నిర్మిస్తున్న ప్రాజెక్టులకు చట్టబద్ధత కల్పించి, రానున్న ఎన్నికల్లో తెలంగాణలో ప్రయోజనం పొందేందుకు కేంద్ర ప్రభుత్వం దృష్టి సారించింది. దీనివల్ల రాష్ట్ర ప్రయోజనాలు పూర్తిగా దెబ్బతింటాయి. నాగార్జునసాగర్ కుడి, ఎడమ కాలువల కింద ఉన్న 15 లక్షల ఎకరాల ఆయకట్టు, కృష్ణా డెల్టా పరిధిలో 13 లక్షల ఎకరాలు, ఎస్ ఆర్ బీసీ కింద రాయలసీమలో 2 లక్షల ఎకరాలు మొత్తంగా 30 లక్షల ఎకరాల ఆయకట్టుకు సాగునీరు లేక బీడుగా మారే ప్రమాదముంది. బచావత్ తీర్పునకు రక్షణ కల్పిస్తూ బ్రిజేశ్ ట్రిబ్యునల్ 2013లో ఇచ్చిన తీర్పును గెజిట్ నోటిఫై చేయలేదు. 2014 పునర్విభజన చట్టంలో ఆమోదించిన అంశాలను పరిగణనలోకి తీసుకోకుండా రాష్ట్ర ప్రయోజనాలకు మంగళం పాడుతూ తెలంగాణలో ఓట్ల కోసం బరితెగింపుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. దీనికి కేంద్రంలోని మోదీ ప్రభుత్వంతో జగన్ ప్రభుత్వ లొంగుబాటే కారణమనే విమర్శలు ఉన్నాయి.

కృష్ణాజలాల పంపిణీపై కేంద్రం కుట్రలు తిప్పికొట్టాలి

రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్షం ఏర్పాటు చేయాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కృష్ణాజలాల పంపిణీపై పునఃసమీక్షించడం ద్వారా వివాదం సృష్టించి...రానున్న తెలంగాణ రాష్ట్ర ఎన్నికలలో లబ్ధిపొందాలన్న మోదీ ప్రభుత్వ కుట్రలను తిప్పికొట్టాలని, ఈ అంశంపై తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి బచావత్ ట్రిబ్యునల్ 811 టీఎంసీల కృష్ణా జలాలు కేటాయించింది. రాష్ట్ర విభజన సమయంలో ఆంధ్రప్రదేశ్‌కు 512 టీఎంసీలు, తెలంగాణకు 299 టీఎంసీలు పంపిణీ చేసింది. తాజాగా రెండు తెలుగు రాష్ట్రాల మధ్య కృష్ణానీటి వివాదం సృష్టించి... తెలంగాణ ఎన్నికలలో లబ్ధిపొందేందుకు మోదీ సర్కార్ పావులు కదుపుతున్నది. బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ అవార్డును ఇంతవరకు నోటిఫై చేయని పరిస్థితుల్లో ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల మధ్య జలాల పంపిణీ బాధ్యతను మళ్లీ అదే ట్రిబ్యునల్‌కు కేంద్రం కట్టబెట్టడం గమనార్హం. నాలుగు రాష్ట్రాలకు కలిపి కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటు చేయాల్సి ఉండగా ఆంధ్ర, తెలంగాణకు మాత్రమే కొత్త ట్రిబ్యునల్ ఏర్పాటును పరిమితం చేయడం మోదీ ప్రభుత్వ కుట్రే. ఇదే అమలయితే తెలంగాణలో అనుమతుల్లేకుండా చేపట్టిన ప్రాజెక్టులన్నీ సక్రమమైపోతాయి. ఆంధ్రప్రదేశ్‌కు తీవ్ర అన్యాయం జరుగుతుంది. నాగార్జునసాగర్ ఆయకట్టుకు నీరు అందే పరిస్థితి ఉండదు. ముఖ్యంగా రాయలసీమ ప్రాంతాలకు నీరందక తీరని నష్టం వాటిల్లుతుంది. అందువల్ల జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం దీనిపై తక్షణమే స్పందించాలి. కృష్ణాజలాల పంపిణీ పునఃసమీక్ష ద్వారా తెలంగాణలో లబ్ధిపొందాలనే బీజేపీ కుయుక్తులను తిప్పికొట్టాలి. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే అఖిలపక్ష సమావేశం జరిపి, సమగ్రంగా చర్చించాలి. కేంద్రం నిర్ణయం వలన ఏపీకి జరిగే అన్యాయాన్ని ప్రధానికి ముఖ్యమంత్రి జగన్ వివరించాలి. తద్వారా ఆంధ్రప్రదేశ్‌కు న్యాయం జరిగే విధంగా ఒత్తిడి తేవాలని రామకృష్ణ డిమాండ్ చేశారు.

ఇదీ లోకం!

బాబ్బాబు! నా చెయ్యి వదలండి, నొప్పెడుతోంది.

ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు?

నేడు పరిశీలకులతో ఈసీ భేటీ

ఐదు రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్ త్వరలోనే ప్రకటించనుంది. నవంబరు-డిసెంబరులో శాసనసభల ఎన్నికలు జరగవచ్చన్న అంచనా ఉంది. అయితే ఎన్నికల తేదీలను ప్రకటించే ముందు పరిశీలకులతో శుక్రవారం ఈసీ భేటీ కాబోతోంది.

2 లో

మీడియా స్వేచ్ఛ హరిస్తే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే

ఐజేయూ, టీయూడబ్ల్యూజే సభలో వక్తల ఆందోళన

విశాలాంధ్ర - హైదరాబాద్: పాలకులు మీడియా స్వేచ్ఛను హరించడమంటే, ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని వక్తలు ఆందోళన వ్యక్తం చేశారు. దేశ రాజధాని ఢిల్లీలో మీడియా సంస్థలపై, జర్నలిస్టులపై జరిగిన దాడులను గర్హిస్తూ హైదరాబాదులో ఇండియన్ జర్నలిస్ట్ యూనియన్ (ఐజేయూ), టీయూడబ్ల్యూజే దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో గురువారం భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ సర్కిల్‌లో ఐజేయూ అధ్యక్షుడు కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన జరిగిన సభలో వక్తలు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ వైఖరిని ముక్తకంఠంతో ఖండించారు. కేంద్రంలో ప్రభుత్వం అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ మీడియా మీద, పౌర సంస్థల మీద ఉక్కుపాదం మోపడం సహించారనిదన్నారు. న్యూస్ క్లిక్ పోర్టల్ కార్యాలయంపై, అందులో పని

- మిగతా 2 లో

పోరాటాల్లో కలిసి రండి

గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ పిలుపు

ఏథెన్స్: గ్రీస్‌లో ఆదివారం (8వ తేదీ) స్థానిక ఎన్నికలు జరగనున్నాయి. దీంతో గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (కేకేఈ) విస్తృతంగా ప్రచారం చేస్తోంది. దేశవ్యాప్తంగా ర్యాలీలు, సభలు నిర్వహిస్తోంది. ఇప్పటికే థెస్సలోనికి, లామియా, లారిస్సా, నియా ఐయోనియా (ఏథెన్స్), నిక్రైయ (పిరేసెస్) తదతర నగరాల్లో ఎన్నికల ర్యాలీలలో కేకేఈ ప్రధాన కార్యదర్శి దిమిత్రిస్ కౌట్సోంబస్ ప్రసంగించారు. తమ పార్టీకి మద్దతివ్వాలని గ్రీస్ ప్రజలను కోరారు. అన్ని పోరాటాల్లో, స్థానిక ఎన్నికల్లో తమతో కలిసి రావాలంటూ పిలుపునిచ్చారు. 'మనకు అనుభవముంది. శాస్త్రీయ సాంకేతికత అభివృద్ధితో సంతరించుకునే ఆధునిక జీవనం సాగించడంలో ఎదురయ్యే సమస్యలను పరిష్కరించుకోవడం సవాల్‌గా మారింది. జీవితం ఓ పోరాటంగా తయారైంది. మన డిమాండ్ల సాధన కోసం పోరాటాలు అనివార్యమయ్యాయి. ఐక్యంగా పోరాడితేనే కావాల్సినవి సాధించుకోగలం. ప్రజలే ప్రజలను కాపాడుకోగలరని నిత్యజీవితంలో ఎదురయ్యే పరిస్థితులు నిరూపించాయి. పోరాడితేనే ప్రజావ్యతిరేక విధానాలను తిప్పికొట్టగలం. కార్మికులకు న్యాయం- ప్రయోజనం చేకూర్చగలం' అని కౌట్సోంబస్ అన్నారు. డిమాండ్లు, వ్యవస్థాగత పోరాటాలను మరింత బలోపేతం చేసుకునేందుకు ఏకమవుదాం.. కేకేఈని బలపరుద్దాం. ప్రజలు, శ్రామికులు, కార్మికుల అవసరాలు, ప్రయోజనాల కోసం ఎలప్పుడు ముందుండి పోరాడే నిజమైన ప్రజల, కార్మికుల పార్టీగా కేకేఈని నిలబెడుదామంటూ ఆయన పిలుపునిచ్చారు.

స్వయంప్రతిపత్తి ఆయుధ వ్యవస్థలు నిషేధించాలి

ఐక్యరాజ్య సమితి, రెడ్‌క్రాస్ అంతర్జాతీయ కమిటీ పిలుపు

వాషింగ్టన్: రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు (ఏఐ) అభివృద్ధి, వినియోగం రోజురోజుకూ పెరుగుతుండటంపై ఐక్యరాజ్య సమితి (ఐరాస) ప్రధాన కార్యదర్శి ఆంటోనియో గుటెర్రస్, రెడ్‌క్రాస్ అంతర్జాతీయ కమిటీ (ఐసీఆర్‌సీ) అధ్యక్షులు మీర్జానా స్పోల్జారిక్ ఆందోళన వ్యక్తంచేశారు. వీటి అపరిమిత వినియోగం మానవాళికి ప్రమాదకరమని హెచ్చరించారు. మానవాళి రక్షణ కోసం స్వయంప్రతిపత్తిగల ఆయుధ వ్యవస్థలను తక్షణమే నిషేధించాలని ప్రపంచ దేశాలకు గురువారం పిలుపునిచ్చారు. మానవుల ప్రమేయం లేకుండా పనిచేసే ఆయుధ వ్యవస్థల వినియోగాన్ని కట్టడి చేసే కొత్త అంతర్జాతీయ నిబంధనలు రూపొందించాలని సూచించారు. ఈ సమస్య పరిష్కారానికి తాము గొంతు కలిపామని గుటెర్రస్, స్పోల్జారిక్ అన్నారు. స్వయంప్రతిపత్తిగల ఆయుధ వ్యవస్థలను తక్షణమే నిషేధించడం వల్ల దాని దుష్పరిణామాల నుంచి ప్రస్తుత, భావి తరాలకు రక్షణ కల్పించగలమన్నారు. ఇందుకు తక్షణ చర్యలు అవశ్యమని ప్రపంచ దేశాధినేతలకు సూచించారు. అంతర్జాతీయ రెడ్‌లైన్ల నిర్ధారణ ద్వారా అన్ని దేశాలకు ప్రయోజనం ఉంటుందని ఐరాస పేర్కొంది. మానవాళి రక్షణకు నిర్ణయాత్మక కార్యాచరణ అత్యవసరమని నొక్కిచెప్పింది. ఇదే అంశమై చర్చల ప్రక్రియను చేపట్టాలని, అన్ని కోణాల్లో చర్చలు జరిపి 2026లోగా కచ్చితమైన నిర్ణయానికి రావాలని సూచించింది. 'మానవాళి రక్షణకు కార్యాచరణ అత్యవసరం. జీవన్మరణ నిర్ణయాలన్నీ మానవాధీనంలో జరగాల్సిందే. యంత్రాలకు సర్వాధికారాలు వద్దు. మానవులను లక్ష్యంగా చేసుకోవడం ద్వారా నైతిక పరిధి అతిక్రమణకు ఆస్కారం కల్పించొద్దు. మానవుల ప్రమేయం లేకుండా ప్రాణాలు తీసే విచక్షణారహిత అధికారం యంత్రాలకు ఉండరాదు. అంతర్జాతీయ చట్టం దీనిని నిషేధించాలి' అని ఐరాస తేల్చిచెప్పింది. రోబోటిక్స్, కృత్రిమ మేధస్సు వంటి కొత్త సాంకేతికల అభివృద్ధి, వినియోగం పెరుగుతుండటం అధిక ముప్పుకు సంకేతాలిస్తోందని హెచ్చరించింది. మానవులు అక్కర్లేని ఆయుధ వ్యవస్థల నిషేధించాల్సిందేనని నొక్కిచెప్పింది. అత్యవసర పరిస్థితిల్లో వినియోగానికి సంబంధించి స్పష్టమైన మార్గదర్శకాలు, నిబంధనలు ఉండాలని స్పష్టంచేసింది. ఎప్పుడు ఎలా పనిచేస్తుందో అంచనా వేయలేని సాఫ్ట్‌వేర్ ఆధారిత మెషిన్ లర్నింగ్ అల్గారిథమ్స్ నియంత్రణలో స్వయంప్రతిపత్తిగల ఆయుధాలు ఉండటం చాలా ప్రమాదమని పేర్కొంది. ఈ వ్యవస్థలను ఎప్పుడు, ఎలా, ఎంత సేపు వాడాలి, లక్షిత దాడుల పరిధి, తీవ్రత ఎంత వంటి అంశాలపై స్పష్టతతో పాటు నియంత్రణ అత్యవసరమని తెలిపింది. సమర్థ మానవ పర్యవేక్షణ, సమయానుచిత జోక్యం, డీయాక్టివేషన్ అవసరమని ప్రపంచ దేశాలకు ఐరాస, ఐసీఆర్‌సీ సూచించాయి.

12న ఆస్ట్రియా లేబర్ పార్టీ పదో వ్యవస్థాపక దినం రేపు వియన్నాలో కార్యక్రమం

వియన్నా: ఆస్ట్రేలియా శ్రామిక వర్గం కోసం మార్క్సిస్టు, లెనినిస్టు పార్టీగా స్థాపించిన ఆస్ట్రియా లేబర్ పార్టీ (పీడీఏ) పదవ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈనెల 12న జరుపుకోబోతోంది. వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆస్ట్రియా రాజధాని వియన్నాలో శనివారం పార్టీ అధ్వర్యంలో అనేక కార్యక్రమాలు జరగనున్నాయి. వీటిలో పాల్గొనేలా సోదర పార్టీలు, కామ్రేడ్‌లు, మిత్రులకు పీడీఏ పిలుపునిచ్చింది. ఆస్ట్రియా కమ్యూనిస్టు పార్టీ (కేపీఓ)లో భాగంగా పీడీఏ ఉంది. కమ్యూనిస్టు, వర్కర్ల పార్టీల అంతర్జాతీయ సమావేశం (ఐఎంసీడబ్ల్యూపీ)లోనూ పాల్గొన్నది. దీనికి టిబోర్ జెంకర్ నాయకత్వం వహిస్తున్నారు.

ఐదు రాష్ట్రాలకు ఎన్నికలు?

న్యూదిల్లీ: ఐదు రాష్ట్రాల్లో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల తేదీలను ఎన్నికల కమిషన్ త్వరలోనే ప్రకటించనుంది. నవంబరు-డిసెంబరులో శాసనసభల ఎన్నికలు జరగవచ్చన్న అంచనా ఉంది. అయితే ఎన్నికల తేదీలను ప్రకటించే ముందు పరిశీలకులతో శుక్రవారం ఈసీ భేటీ కాబోతోంది. ఈసీ పోలీస్, సార్వత్రిక, వ్యయం సంబంధిత పరిశీలకులతో సమావేశమై ఎన్నికల నిబంధనావళి సమర్థ అమలు, ధన-కండ బలం కట్టడికి చర్యలపై చర్చించనుంది. రాజస్తాన్, మిజోరం, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో ఎన్నికల సన్నదద్ధతను ఇప్పటికే పరిశీలించింది. ఎన్నికల కమిషన్ గురువారం తెలంగాణ పర్యటననూ ముగించుకుంది. కాగా, తెలంగాణలో బీఆర్ఎస్, మధ్యప్రదేశ్‌లో బీజేపీ, చత్తీస్‌గఢ్- రాజస్తాన్ రాష్ట్రాల్లో కాంగ్రెస్ అధికారంలో ఉంటే మిజోరంలో మిజో నేషనల్ ఫ్రంట్ ఉంది. ఈశాన్య రాష్ట్ర అసెంబ్లీ పదవీకాలం డిసెంబరు 17న ముగియనుంది. వచ్చే ఏడాది జనవరిలో మిగతా నాలుగు రాష్ట్రాల అసెంబ్లీల పదవీకాలం ముగియబోతోంది.

ధనబలం, ఉచితాలపై ప్రత్యేక నిఘా

80ఏళ్లు పైబడితే ఇంటి నుంచే ఓటు

తెలంగాణ ఎన్నికలపై సీఈసీ రాజీవ్ కుమార్

హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీకి త్వరలో ఎన్నికలు జరగనున్నాయి. దీంతో ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) రాజీవ్ కుమార్ నేతృత్వంలో 17 మందితో కూడిన బృందం రాష్ట్రంలో పర్యటించి ఎన్నికల సన్నద్ధతను పరిశీలించింది. ఇదే క్రమంలో రాజకీయ పార్టీలు, రాష్ట్ర-కేంద్ర ప్రభుత్వ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ సంస్థల ప్రతినిధులతో సీఈసీ సమావేశమయ్యారు. మూడు రోజులుగా చేపట్టిన కార్యక్రమాల వివరాలను గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో రాజీవ్ కుమార్ వెల్లడించారు. మొదటిసారిగా 80ఏళ్లు పైబడిన వారికి ఇంటి నుంచి ఓటేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు ప్రకటించారు. అలాగే 40శాతం లేక అంతకంటే ఎక్కువ అంగవైకల్యం ఉన్న వారు కూడా ఇంటి నుంచే తమ ఓటు హక్కును వినియోగించుకోవచ్చని తెలిపారు. ఎన్నికలు పారదర్శకంగా జరిపేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ధనబలం కట్టడికి కఠినంగా వ్యవహరించాలని దర్యాప్తు సంస్థలకు ఆదేశాలిచ్చామన్నారు. ధన బలం, ఉచితాల పంపిణీ వంటివాటిపై ప్రత్యేక నిఘా పెట్టామని చెప్పారు. దర్యాప్తు సంస్థలు సమయానుచితంగా పనిచేసేలా చూస్తామని రాజీవ్ కుమార్ తెలిపారు. ఆన్‌లైన్ లావాదేవీలపై నిఘా పెట్టాలని బ్యాంకులకు సూచనలు చేసినట్లు వెల్లడించారు. ఎన్నికలు పారదర్శకంగా జరిగేలా చూడాలని రాజకీయ పార్టీలు కోరినట్లు చెప్పారు. తెలంగాణలో మొత్తం 3.17 మంది ఓటర్లు ఉండగా వీరిలో పురుషులు, మహిళలు దాదాపు సమానంగా ఉన్నారని సీఈసీ అన్నారు. యువ ఓటర్ల సంఖ్య ఎనిమిది లక్షలు దాటిందన్నారు. 2022-23లో 22 లక్షలకుపైగా ఓట్లను పరిశీలించి తొలగించినట్లు తెలిపారు. 'ఓటర్ల జాబితాల్లో అవకతవకలు జరగవచ్చని కొన్ని పార్టీలు ఆందోళన చెందాయి. బుధవారం ఓటర్ల తుది జాబితా వెల్లడించాం. జులై తర్వాత దరఖాస్తు చేసుకున్న 2.21 లక్షల మంది యువతీయువకులకు ఓటు హక్కు కల్పించాం. 66 నియోజకవర్గాల్లో పురుషుల కంటే మహిళా ఓటర్లే ఎక్కువ. 18-19 ఏళ్ల మహిళా ఓటర్లు

3.45 లక్షల మంది ఉన్నారు. 80 ఏళ్లు దాటిన వారితో పాటు 40శాతానికిపైగా వైకల్యమున్న వారికి ఇంటి నుంచే ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నాం. రాష్ట్రంలో మొత్తం పోలింగ్ కేంద్రాలు 35,356 కాగా ఒక్కో కేంద్రంలో సగటు ఓటర్ల సంఖ్య 897గా ఉంది. ఫిర్యాదుల స్వీకరణ కోసం సీ విజిల్ యాప్‌ను అందుబాటులోకి తెచ్చాం' అని రాజీవ్‌కుమార్ తెలిపారు.

పత్రికా స్వేచ్ఛపై దాడి ప్రజాస్వామ్యానికి ముప్పే

న్యూస్‌క్లిక్‌పై ఎన్ఐఏ దాడి ఘటనపై జర్నలిస్టు సంఘాల నిరసన

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, కార్పొరేట్లకు దోచిపెట్టే అంశాలపై నిరంతరం ప్రజలను చైతన్యం చేస్తున్న న్యూస్‌క్లిక్ ఎడిటర్, ఇతర సిబ్బందిపై ఉపా చట్టం కింద కేసులు నమోదు చేసి అరెస్టు చేయడం పత్రికా స్వేచ్ఛపై దాడని, ఇది ప్రజాస్వామ్యానికి ముప్పని పలువురు వక్తలు పేర్కొన్నారు. న్యూస్ క్లిక్ న్యూస్ ఏజెన్సీలో ఎన్ఐఏ సోదాలు నిర్వహించి సంస్థ ఎడిటర్, ఇతర సిబ్బందిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయడానికి నిరసనగా గురువారం విజయవాడలో జర్నలిస్టులు, ప్రజా సంఘాలు, కార్మిక సంఘాల ఆధ్వర్యంలో పెద్దఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రజాశక్తి సంపాదకులు బి.తులసీదాసు మాట్లాడుతూ ప్రజాతంత్ర పద్ధతుల్లో నడుస్తున్న మీడియా సంస్థల నోరునొక్కడమే పనిగా, కక్షపూరితంగా కేంద్రం వ్యవహరిస్తోందన్నారు. కేంద్ర ప్రభుత్వం చేస్తున్న అక్రమాలు, దోపిడీలను న్యూస్‌క్లిక్ ఏజెన్సీ ఎప్పటికప్పుడు బయటపెడుతోందని, దీన్ని సహించలేకే అనవసరపు ఆరోపణలు చేసి సంస్థ ఎడిటర్‌ను అరెస్టు చేసిందని విమర్శించారు. న్యూయార్కుటైమ్స్ పేపర్లో వచ్చిన కథనం అధారంగా అరెస్టు చేశామని చెబుతున్నారని, దాని కేంద్రమైన అమెరికా రక్షణ మంత్రి మాత్రం న్యూయార్క్‌టైమ్స్ కథనాల్లో ఖచ్చితత్వాన్ని తాము గుర్తించబోమని చెప్పారని గుర్తు చేశారు. అదే కథనం అధారంగా కేసులు నమోదు చేయడం ఏం ప్రజాస్వామ్యమని, ఆ పత్రిక అభియోగాల్లో నిజం ఏమిటని ప్రశ్నించారు. ఏపీయూడబ్ల్యూజే ప్రధానకార్యదర్శి చందు జనార్ధన్ మాట్లాడుతూ, న్యూస్‌క్లిక్‌పై దాడి ప్రజాస్వామ్య వ్యవస్థపై దాడ అన్నారు. తమకు అనుకూలంగా లేని పత్రికలపైనా, వ్యవస్థలపైనా కేంద్రం పదే పదే దాడులు చేయిస్తోందని చెప్పారు. ఇప్పుడు పత్రికలపై దాడి అంటే భవిష్యత్‌లో ప్రజాస్వామ్యాన్ని కూడా ప్రశ్నార్థకం చేస్తారు. దీన్ని చూస్తు ఊరుకుంటే కేంద్రం చేసే అరాచకాలకు అడ్డూఅదుపు ఉండదు. ఇప్పటికే అనేక సంస్థలు, వ్యక్తులపై ఎన్ఐఏతో దాడులు చేయిస్తున్నారన్నారు. న్యూస్‌క్లిక్ చేసిన తప్పేమిటో చెప్పకుండా ఎడిటర్, హెచ్ఆర్ మేనేజరుపై ఉపా చట్టం కింద కేసులు పెట్టడం చూస్తుంటే ప్రజాస్వామ్యాన్ని బతకనిచ్చే పరిస్థితి కనిపించడం లేదని ఎన్ఏజె నాయకురాలు శాంతిశ్రీ అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ అధ్యక్షులు చావా రవి, కార్యదర్శి కొండా రాజేశ్వరరావు, స్టేట్ కౌన్సిల్ సభ్యులు దారం వెంకటేశ్వరరావు, దాసరి నాగరాజు, ప్రెస్‌క్లబ్ కార్యదర్శి ఆర్.వసంత్, సంగమం నాయకులు దివికుమార్, జర్నలిస్టు సంఘం నాయకులు వలీ, కృష్ణంరాజు, వీర్ల శ్రీరామ్ యాదవ్,, అరసం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వల్లూరి శివప్రసాద్, విరసం అధ్యక్షులు అరసవిల్లి కృష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధానకార్యదర్శి చంద్రానాయక్, ఏఐఎస్ఎఫ్ నాయకులు సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్ నగర అధ్యక్ష కార్యదర్శులు కలిమిశ్రీ, ఎం.బి.నాథన్ కార్యక్రమానికి అధ్యక్షత వహించగా సీనియర్ జర్నలిస్టు వల్లభనేని సురేశ్ వందన సమర్పణ చేశారు.

రూ.100 లంచం చిన్న విషయమే

బాంబే హైకోర్టు

ముంబై: వంద రూపాయలను లంచంగా తీసుకున్న ఒక వైద్యుడిని నిర్దోషిగా పరిగణిస్తూ బాంబే హైకోర్టు గురువారం తీర్పు వెలువరించింది. దీన్ని చాలా చిన్న విషయంగా పరిగణిస్తున్నట్లు తెలిపింది. దీంతో కొన్నేళ్లుగా అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వైద్యుడికి ఉపశమనం లభించింది. పూణెలోని పౌడ్ గ్రామీణ ఆసుపత్రిలో అనిల్ షిండే అనే వ్యక్తి వైద్య సేవలందిస్తున్నారు. ఈ క్రమంలోనే స్థానికంగా నివాసముంటున్న ఎల్‌టీ పింగ్లే తనకు గాయం కావడంతో చికిత్స కోసం షిండే వద్దకు వెళ్లారు. తనను రూ. 100 లంచం అడిగారంటూ వైద్యునిపై అవినీతి నిరోధక బ్యూరోకి ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో వైద్యుడు లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. దీంతో 2007లో అనిల్ షిండేపై కేసు నమోదు చేశారు. 2012లో ఈ కేసును విచారించిన స్పెషల్ కోర్టు షిండేను నిర్దోషిగా విడుదల చేసింది. ఈ తీర్పును సవాలు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. 2007లో రూ. 100 లంచం తీసుకోవడం చాలా చిన్న విషయమని బాంబే హైకోర్టు పేర్కొంది. ప్రస్తుతం ఈ కేసు విచారణకు రాగా గతంలో స్పెషల్ కోర్టు ఇచ్చిన తీర్పును న్యాయస్థానం సమర్థించింది. ఈ అంశంపై 2023లో మళ్లీ అప్పీలు చేయడాన్ని తప్పుపట్టింది. అవినీతి నిరోధక చట్టంలోని కొన్ని నిబంధనలపై నిందితుడిని నిర్దోషిగా పరిగణిస్తున్నట్లు పేర్కొంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన ఈ పిటీషన్‌ను కొట్టివేస్తూ వైద్యుడికి ఉపశమనం కల్పించింది.

ఇది ఎమర్జెన్సీ కాలమా?

46 మంది జర్నలిస్టులకు బెదిరింపులు

ఇళ్లలో సోదాలు ఆక్షేపణీయం

న్యూస్‌క్లిక్‌పై చర్యలు హాస్యాస్పదం: సంజయ్‌బారు

న్యూదిల్లీ: ప్రజల తరపు గళమైన జర్నలిస్టులపై అణచివేత, కలానికి కళ్లెం వేసే వ్యవస్థాగత కుతంత్రాలు జరుగుతుంటే దేశం ఎలా పురోగతి సాధిస్తుందని మేధావివర్గం ప్రశ్నిస్తోంది. ప్రముఖ వార్తాసంస్థ న్యూస్‌క్లిక్‌పై దాడులు, సంపాదకుడు అరెస్టు, సిబ్బంది విచారణ, ఇళ్లు, కార్యాలయాల్లో సోదాలను ఖండించింది. న్యూస్‌క్లిక్‌పై పోలీసు ఆపరేషన్ నవ్వు తెప్పిస్తోందని బిజినెస్ స్టాండర్డ్ పూర్వ సంపాదకులు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్‌కు అప్పటి ప్రధాన మీడియా సలహాదారు సంజయ్‌బారు వ్యాఖ్యానించారు. పోలీసులు చర్యలు వారి అసమర్థతకు అద్దంపడుతున్నాయన్నారు. '46 మంది జర్నలిస్టుల 50 ఇళ్లు, కార్యాలయాల్లో 200 మందికిపైగా పోలీసులు సోదాలు నిర్వహించారు. పాత్రికేయులను బెదిరించేలా వ్యవహరించారు. ఈ పరిస్థితి ఎమర్జెన్సీ కాలాన్ని గుర్తుచేసింది' అని ది వైర్‌కిచ్చిన ఇంటర్వ్యూలో అన్నారు. రైతుల ఆందోళనలు, పౌరసత్వ (సవరణ) చట్టం వ్యతిరేక నిరసనలు, ఢిల్లీ ఘర్షణలు వంటివాటిపై వార్తలు సేకరించారా, కథనాలు రాసారా అని పాత్రికేయులను ప్రశ్నించడం అసంబద్ధం, హాస్యాస్పదమని వ్యాఖ్యానించారు. ఇలాంటి వార్తలు అందజేయడం జర్నలిస్టుల విధిధర్మమని చెప్పారు. తమ వృత్తిపరంగా చేసిన పనిని దేశ ద్రోహంగా ముద్రవేయడం ఆక్షేపణీయమన్నారు. పురకాయస్థ, చక్రవర్తిపై ఆరోపణలు హాస్యాస్పదమని సంజయ్‌బారు చెప్పారు. బుధవారం ప్రెస్ క్లబ్ ఆఫ్ ఇండియా అధ్వర్యంలో జరిగిన నిరసనలో ప్రముఖ వార్తాధానళ్లు, వార్తాపత్రికల సంపాదకులు ఎవరూ పాల్గొనకపోవడం బాధాకరమన్నారు. కాగా, సమాజంలో అసంతృప్తి జ్వాల రగిల్చేందుకు, తప్పుడు కథనాల ప్రచారానికి, కోవిడ్-19 మహమ్మారి కట్టడికి భారతప్రభుత్వ చర్యలను అసమర్థమైనవిగా చూపేందుకు చైనా నిధులను వాడినట్లు న్యూస్‌క్లిక్‌పై ఆరోపణలు వచ్చాయి.

కశ్మీర్, అరుణాచల్‌ప్రదేశ్‌ను భారత్ భూభాగం కానివిగా చూపేందుకు ఈ-మెయిల్ల ద్వారా రహస్య మంతనాలు జరిగాయని ఆరోపణలు ఉన్నాయి. అలాగే 1991 నుంచి గౌతమ్ నవలఖతో న్యూస్‌క్లిక్ జర్నలిస్టులకు స్నేహం ఉందని, 2018 నుంచి న్యూస్‌క్లిక్ భాగస్వాముల్లో ఆయన ఒకరిగా ఉన్నారని కూడా ఆరోపించారు.

ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసినట్లే

(మొదటిపేజీ తరువాయి)

చేస్తున్న 47 మంది జర్నలిస్టులపై దిల్లీ పోలీసులు దాడులు జరిపిన తీరు దిగ్భ్రాంతి కలిగిస్తున్నదన్నారు. ఎందుకు సోదాలు జరుపుతున్నారో, ఎందుకు అరెస్టులు చేస్తున్నారో తెలపకుండా చీకటి రోజులను గుర్తు చేసే విధంగా దిల్లీ స్పెషల్ బ్రాంచ్ పోలీసులు వ్యవహరించారని వారు విమర్శించారు. కఠినమైన ఉపా చట్టం కింద కేసులు నమోదు చేస్తున్నామని చెప్పున్న పోలీసులు ముందుగా ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయడం లేదో చెప్పడం లేదన్నారు. చైనా పెట్టుబడులను బూచిగా చూపి ప్రజాస్వామ్యాన్ని హరించాలని చూస్తున్నారని చెప్పారు. కారణం చెప్పకుండా అరెస్టు చేయడం ప్రాథమిక హక్కుకు భంగం కలిగించడమేనని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ కె సుదర్శన్ రెడ్డి వ్యాఖ్యానించారు. ఇందిరా గాంధీ హయాంలో 1975లో ప్రకటిత ఎమర్జెన్సీ అమలు కాగా నేడు నరేంద్ర మోదీ పాలనలో అప్రకటిత ఎమర్జెన్సీని అమలు చేస్తూ ప్రజాస్వామ్య సంస్థలను నిర్వీర్యం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మానవ హక్కుల నేత, ప్రముఖ రచయిత ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ దేశంలో కొనసాగుతున్న నిర్బంధకాండ ప్రమాదకర పరిస్థితులను సూచిస్తోందని వ్యాఖ్యానించారు. స్వేచ్ఛ లేని బతుకు అర్థరహితమని, దాన్ని కాపాడాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరించడం విచారకరమని అన్నారు. సుప్రసిద్ధ పాత్రికేయుడు కె రామచంద్రమూర్తి, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె. శ్రీనివాస్ మాట్లాడుతూ మీడియా స్వేచ్ఛ, భావ ప్రకటన స్వాతంత్ర్యంపై జరుగుతున్న దాడులను ప్రతిఘటించడానికి జర్నలిస్టులంతా సమైక్య పోరాటం సాగించాల్సిన అవసరం ఆసన్నమైందని చెప్పారు. విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్ మాట్లాడుతూ, ప్రధాని మోదీ చెపుతున్నట్టుగా ఇది అమృతకాలం కాదన్నారు. దేశంలో ప్రస్తుతం విషపూరిత వర్షం కురుస్తోందని చెప్పారు.

భారీ ర్యాలీ:

మీడియా సంస్థలు, జర్నలిస్టులపై కేంద్ర ప్రభుత్వ ఉక్కుపాదాన్ని నిరసిస్తూ, గురువారం హైదరాబాద్‌లో జర్నలిస్టులు గర్జించారు. మీడియా స్వేచ్ఛను హరిస్తే ఖబడ్దార్, దిల్లీ పోలీసుల వైఖరిని ఖండిస్తున్నాం, భావ ప్రకటన స్వేచ్ఛను కాపాడుదాం, రాజ్యాంగ హక్కులను గౌరవిద్దాం అంటూ జర్నలిస్టులు చేసిన నినాదాలతో భాగ్యనగరం వీధులు మారుమ్రోగాయి. ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ), తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం (టీయూడబ్ల్యూజే) నేతృత్వంలో, హెచ్‌యూజే, హైదరాబాద్ ప్రెస్ క్లబ్, నెట్వర్క్ ఆఫ్ ఉమెన్ ఇన్ మీడియా ఇండియా, తెలంగాణ ఫోటో జర్నలిస్ట్స్ అసోసియేషన్, తెలంగాణ చిన్న, మధ్యతరహా పత్రికలు, మేగజైన్స్ అసోసియేషన్ భాగస్వామ్యంతో భారీ నిరసన ప్రదర్శన జరిగింది. బషీర్ బాగ్ లోని టీయూడబ్ల్యూజే కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ప్రదర్శన ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ సర్కిల్‌కు చేరుకుంది. ఆయా ప్రజాసంఘాలు, సామాజిక కార్యకర్తలు ఈ ఆందోళన కార్యక్రమానికి సంఘీభావం ప్రకటించారు. అనంతరం ఐజేయూ అధ్యక్షులు కె. శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షతన అంబెడ్కర్ విగ్రహం వద్ద సభ జరిగింది. ఈ ప్రదర్శన, సమావేశంలో సుప్రీం కోర్టు మాజీ విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ సుదర్శన్ రెడ్డి, హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టీస్ చంద్రకుమార్, ఐఏఎస్ మాజీ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్లు జి.హరగోపాల్, కోదండరాం, పి.ఎల్.విశ్వేశ్వరరావు, పద్మజాషా, ఖాసీం, సీనియర్ సంపాదకులు కె. రామచంద్ర మూర్తి, ఆంధ్రజ్యోతి సంపాదకులు కె.శ్రీనివాస్, విశాలాంధ్ర సంపాదకులు ఆర్వీ రామారావ్, సియాసత్ సంపాదకులు అమీర్ అలీ ఖాన్, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, వీక్షణం సంపాదకులు వేణుగోపాల్, పాశం యాదగిరి, తోట భవన్నారాయణ, రహ్మాన్, ప్రముఖ రచయిత, గాయకులు జయరాజ్, సామాజిక నిపుణులు రమా మేల్కొటే, సజయ, ఉమెన్ అండ్ ట్రాన్స్ జెండర్ జేఏసీ బాధ్యులు సంధ్య, ఓపీడీఆర్ బాధ్యులు జయ వింధ్యాల, తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు నగునూరి శేఖర్, కే.విరాహత్ అలీ, ఐజేయూ కార్యదర్శి వై.నరేందర్ రెడ్డి, హైదరాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు వేణుగోపాల్ నాయుడు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు జి.బాల్ రాజ్, పెద్ద సంఖ్యలో జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎఫ్ఐఆర్ ప్రతి ఇచ్చేందుకు దిల్లీ పోలీసుల తిరస్కృతి

దాని చట్టబద్ధతను కోర్టులో సవాల్ చేసే యోచనలో 'న్యూస్‌క్లిక్'

న్యూదిల్లీ: తనపై కేసుకు సంబంధించి దాఖలైన ఎఫ్ఐఆర్ ప్రతి కోరిన న్యూస్‌క్లిక్ సంపాదకులు ప్రబీర్ పురకాయస్థను దిల్లీ పోలీసులు ముప్ప తిప్పలు పెడుతున్నారు. ఆయన విజ్ఞప్తిని తిరస్కరించారు. ఎఫ్ఐఆర్ ప్రతిని పొందేందుకు న్యూస్‌క్లిక్ తరపు న్యాయవాదులు శ్రమిస్తుంటే మీడియాలోని ఓ వర్గానికి దానిని పోలీసులు లీక్ చేసినట్లు తెలుస్తోంది. ఏ కారణాలతో తనను అరెస్టు చేశారన్నది తెలుసుకునే ప్రాథమిక హక్కు నిందితుడికి ఉంటుంది. ఈ మేరకు రాజ్యాంగంలోని అధికరణ 22(1) చెబుతుంది. కానీ పురకాయస్థ వ్యవహారంలో ఎఫ్ఐఆర్ ప్రతిని పొందడం న్యూస్‌క్లిక్ లాయర్లకు సవాల్‌గా మారింది. దీంతో ప్రతి లేకుండానే ఎఫ్ఐఆర్ చట్టబ ద్ధతను కోర్టులో సవాల్ చేయాలని న్యాయవాదులు భావిస్తున్నారు. చట్టవ్యతి రేక కార్యకలాపాల (నిరోధక) చట్టం (ఉపా) కింద ప్రబీర్ పురకాయస్థతో పాటు సంస్థ హెచ్ఆర్ శాఖాధిపతి అమిత్ చక్రవర్తి మంగళవారం అరెస్టు కాగా వారిద్దరు ప్రస్తుతం పోలీసు కస్టడీలో ఉన్నారు. పురకాయస్థ దరఖాస్తు 'ప్రీమెచ్యూర్' అని ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ అతుల్ శ్రీవాత్సవ అన్నారు. కోర్టుకు కాదు పోలీసు కమిషనర్‌ను ఆశ్రయించాలన్నారు. న్యూస్‌క్లిక్ జర్నలిస్టులు 46 మంది ఆస్తులను దిల్లీ పోలీసులు సోదా చేశారు. అనేక మందిని విచారించారు. గురువారం కూడా పోలీసులు వార్తాసంస్థపై దాడులు కొనసాగించారు. కార్యాలయం కాంట్రాక్టర్‌ను అదుపులోకి తీసు కొని పోలీసు స్టేషన్‌కు తరలించారు. చర్యలు, అరెస్టులు కొనసాగుతున్నా ఎఫ్ఐఆర్ ప్రతిని మాత్రం న్యూస్‌క్లిక్ తరపు న్యాయవాదులకు ఇచ్చేందుకు పోలీసులు నిరాకరిస్తున్నారు. పాటియాలా హౌస్ కోర్టులో అదనపు సెషనల్స్ జడ్జి హరదీప్ కౌర్‌ను పురకాయస్థ ఆశ్రయించగా పోలీసులకు కోర్టు నోటీసులిచ్చింది. కానీ ఎఫ్ఐఆర్ ప్రతి చేతికి రాలేదు. దీంతో ఎఫ్ఐఆర్ ప్రతి లేకపోయినాగానీ దాని చట్టబద్ధతను కోర్టులో సవాల్ చేసే యోచనలో న్యూస్‌క్లిక్ తరపు న్యాయవాదులు ఉన్నారు.

లంచం కేసులో చట్టసభ్యులకు రక్షణపై సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు

న్యూదిల్లీ: అవినీతి కేసుల్లో చట్టసభ్యులకు విచారణ నుంచి రక్షణ కల్పిస్తూ వెలువడిన 1998 నాటి తీర్పు పున:పరిశీలనపై తాజా తీర్పును సుప్రీంకోర్టు రిజర్వులో పెట్టింది. చట్టసభల్లో ప్రసంగాలు లేక ఓటుకు లంచం తీసుకునే వ్యవహారాల్లో ఎంపీలు, ఎమ్మెల్యేలకు రక్షణ కల్పించే 1998 నాటి తీర్పుపై సమీక్ష కోరుతూ దాఖలైన పిటిషన్ మీద సీజేఐ చంద్రచూడ్ నేతృత్వ ఏడుగురు జడ్జిల విస్తృత ధర్మాసనం విచారణ చేపట్టింది. దేశాన్ని కుదిపివేసిన జేఎంఎం లంచం కుంభకోణం తర్వాత వెలువడిన తీర్పును 25 ఏళ్ల తర్వాత సర్వోన్నత న్యాయస్థానం పున:పరిశీలిస్తోంది.

కోదాడ, సూర్యాపేట మీదుగా విజయవాడ-హైదరాబాద్ రైల్వే లైను వేయాలి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: సికింద్రాబాద్ రైల్వే ఆఫీసర్స్ క్లబ్ లో సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు జీఎం కమ్ చైర్మన్ అరుణ్ కుమార్ జైన్ అధ్యక్షతన దక్షిణ మధ్య రైల్వే 75వ బోర్డు సమావేశం గురువారం జరిగింది. సమావేశంలో బోర్డు మెంబర్ పృథ్వీరాజ్ నాయక్ మాట్లాడుతూ... ప్రధానంగా కోదాడ, సూర్యాపేట మీదుగా హైదరాబాద్-విజయవాడ రైల్వే లైను వేయాలని కోరారు.

ఈ లైను కి సంబంధించి కావాల్సిన చర్యలు వెంటనే చేపట్టాలన్నారు. దీని ద్వారా రెండు తెలుగు రాష్ట్రాల ప్రయాణికులకు మేలు జరుగుతుందని సూచించారు. విజయవాడ , సికింద్రాబాద్ నుంచి అరుణాచలం (తిరువన్నామలై) కు రెగ్యులర్ రైలు నడపాలని కోరారు. అయ్యప్ప స్వాములు శబరిమలై దర్శన నిమిత్తం రైళ్ల రద్దీతో ఇబ్బందులకు గురవుతున్నారని, వారికోసం అయ్యప్ప సీజన్లో

రెగ్యులర్ ప్రత్యేక రైళ్లను నడపాలని బోర్డు దృష్టికి తీసుకెళ్లారు. తాను ప్రతిపాదించిన అంశాలపైనా తగు చర్యలు చేపడతామని బోర్డు జీఎం హామీ ఇచ్చారన్నారు. ఈ సమావేశానికి దక్షిణ మధ్య రైల్వే పోలీస్ కమిషనర్ ఆరోమా సింగ్ ఠాకూర్, జీఎం అరుణ్ కుమార్ జైన్, డిప్యూటీ జీఎం ముత్యాల నాయుడు, బోర్డు సభ్యులు, రైల్వే ఉన్నతాధికారులు హాజరయ్యారు.

టీడీపీని జనసేన టేకోవర్ చేసిందా?: సజ్జల

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: తెలుగుదేశం పార్టీని జనసేన టేకోవర్ చేసిందా, అలా చేస్తే ప్రజలకు చెప్పాలి కదా అని రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి వ్యాఖ్యానించారు. టీడీపీ బలహీనపడిందని పవన్ కల్యాణ్ చెప్పారని, జవసత్వాలు ఉడిగి పోయిందని ప్రకటించారని ఆయన గురువారం విలేకరులతో అన్నారు. పవన్ మాటలను టీడీపీ నేతలు ఒప్పుకోవాలని, ఆ పార్టీలు ఎన్ని సీట్లలో పోటీ చేస్తాయో చెప్పాలన్నారు. ఎన్డీయే నుంచి బయటకు వచ్చానన్న పవన్ మాటలపై బీజేపీ స్పందించాలని డిమాండ్ చేశారు. స్కిల్ కుంభకోణంలో టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు తరపు న్యాయవాదులు 17ఏ గురించి మాత్రమే మాట్లాడుతున్నారని, కుంభకోణం జరిగిందని గుర్తించారు కాబట్టే ఇంకేమీ మాట్లాడలేకపోతున్నారని ఎద్దేవా చేశారు. ఆరోపణలు ఎదుర్కొంటూ పారిపోయిన వారిని త్వరగా పలిపించి సీఐడీకి అప్పగిస్తే మంచిదని చంద్రబాబుకు సూచించారు. చంద్రబాబును జైలులో పెట్టింది కోర్టు అని, జగన్ కాదనే విషయం గమనించాలన్నారు. ముందస్తు ఎన్నికలకు వెళ్లాల్సిన అవసరం జగన్‌కు లేదని చెప్పారు. లోకేశ్ పనిపాట లేకుండా విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కేంద్ర,రాష్ట్రాల మధ్య ఉన్న సంబంధాలనే జగన్ కొనసాగిస్తున్నారని, దానివల్ల రాష్ట్రానికి ప్రయోజనాలు కనిపిస్తున్నాయని సజ్జల చెప్పారు.

జగన్‌కు టాటా చెబుదాం

- సంపద సృష్టించకుండా పథకాలెలా?
- పోలీసులతోనే వైసీపీ నేతలకు గుణపాఠం నేర్పిస్తాం
- ప్రజల కోసం నిలబడతా
- ముదినేపల్లి సభలో జనసేన అధినేత పవన్ కల్యాణ్

విశాలాంధ్ర-ముదినేపల్లి: ఏ పోలీసులతో అయితే కేసులు పెట్టించారో, అదే పోలీసులతో గుణపాఠం నేర్పిస్తామని వైసీపీ నేతలను జనసేన అధినేత పవన్ కల్యాణ్ హెచ్చరించారు. మీరు భయపడ్డారంటే... మీరు బలహీనపడ్డట్లేనని వైసీపీని విమర్శించారు. నేను ఎన్డీయే కూటమిలో ఉంటే ఎంత... లేకపోతే ఎంత అంటూ సంచలన వ్యాఖ్యలు చేశారు. వారాహి విజయయాత్రలో భాగంగా ఉమ్మడి కృష్ణాజిల్లా ముదినేపల్లిలో జరిగిన బహిరంగ సభలో ఆయన ప్రసంగించారు. తానంటే వైసీపీ నేతలకు ఎందుకంత భయం అంటూ ప్రశ్నించారు. ఎవరెవరిపై ఏ కేసులు పెట్టారో కూడా అన్నీ గుర్తున్నాయని పవన్ దుయ్యబట్టారు. దిల్లీకి వెళ్లారు కదా... తెలంగాణతో పాటు ఎన్నికలంటే మరో నెలన్నర రోజులే మీరు అధికారంలో ఉండేదని సీఎం జగన్‌ను ఉద్దేశించి పవన్ వ్యాఖ్యానించారు. మేము గెలిచిన రోజున.. దమ్ముంటే మీ ఇళ్లల్లో, మీ ఆఫీసుల్లో వుండండి అంటూ ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజల్ని కులాలపరంగా విడగొడితే చూస్తూ కూర్చేనే పార్టీ జనసేన కాదన్నారు. వారసత్వ రాజకీయాలపట్ల తనకు ఇబ్బందేమి లేదని పవన్ కల్యాణ్ అన్నారు. కైకలూరులో ఒక వంతెన కూడా నిర్మించలేకపోయారని... వంతెనకు 80 శాతం ఖర్చు చేసినా ఇప్పటికీ పూర్తి కాలేదని పవన్ దుయ్యబట్టారు. అంచెలంచెలుగా ప్రజల జీవితాలను గుప్పిట్లో పెట్టుకుంటున్నారని... వైసీపీ రహిత ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటు చేస్తామని ఆయన స్పష్టం చేశారు. టీడీపీ-జనసేన కలిస్తే వైసీపీ భయపడాల్సిన అవసరం లేదని... మొత్తం 175 సీట్లు వైసీపీకే వస్తాయని చెబుతున్నారుగా... మొత్తం సీట్లు మీకు వస్తే టీడీపీ, జనసేనలకు భయపడనక్కర్లేదన్నారు. వైసీపీ నిజంగా అద్భుతంగా పాలిస్తే వచ్చే ఎన్నికల్లో గెలవాలని పవన్ సవాల్ విసిరారు. భయపడుతున్నారంటే మాకు బలం ఉందని ఒప్పుకున్నట్లేనని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. జనసేనకు 150 ఎమ్మెల్యే, 30 ఎంపీ సీట్లు వుంటే విపక్షాల ఊసే ఎత్తనని ఆయన స్పష్టం చేశారు. కచ్చితంగా వైసీపీ భవిష్యత్తు తేలుస్తామని పవన్ హెచ్చరించారు. నాపై దాడి చేయడానికి నా కార్యాలయం చుట్టూ మోహరించారని పవన్ ఆరోపించారు. జనసేన, టీడీపీ అధికారంలోకి రాగానే పెంచిన మద్యం ధరలు తగ్గిస్తామని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. మద్యం మొత్తం నిషేధిస్తానని అబద్ధపు మాటలు తాను చెప్పనన్నారు. మహిళలు ముందుకొచ్చి అడిగినచోట మద్యం నిషేధిస్తామని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. సర్పంచ్‌లు మద్య నిషేధం కోరితే అదనపు నిధులిస్తామని ఆయన తెలిపారు. వైసీపీ నేతల దృష్టిలో ఎవరూ ఎవరినీ పొగడకూడదని, అవతలి వ్యక్తి ఎంత గొప్పవాడు అయినా ఈ వైసీపీ నేతలు అతడిని తిడతారని పవన్ వెల్లడించారు. వైసీపీ నేతలు ఆఖరికి రజనీకాంత్ ను కూడా వదల్లేదని, ఆయనను కూడా తిట్టారని పవన్ వివరించారు. జగన్ ను పంపించే సమయం వచ్చేసిందని, ఇక జగన్ కు టాటా చెప్పేద్దాం అని పిలుపునిచ్చారు. సీఎం పదవి వస్తే బలంగా పనిచేస్తానని, లేకపోతే బాధ్యతగా పనిచేస్తానని ఉద్ఘాటించారు. ఏదేమైనా ప్రజల కోసం నిలబడడం పక్కా అని పేర్కొన్నారు. రాష్ట్రం ఇబ్బందుల్లో ఉందని, స్కూళ్లు మూతపడిపోతున్నాయని, వలసలు పెరుగుతున్నాయని అన్నారు. అందుకే తన ప్రాణం పోయేంత వరకు రాష్ట్ర భవిష్యత్ కోసం, ప్రజల కోసం పనిచేయాలని కోరుకుంటున్నానని తెలిపారు. అందరం కలిసి వెళతామనే అనుకుంటున్నామని అభిప్రాయపడ్డారు. ఇక, తానేమీ ప్రభుత్వ పథకాలకు వ్యతిరేకం కాదని... ఇంకో రూ.10 వేలు ఎక్కువ ఇవ్వాలని, అందరికీ ఉద్యోగాలు ఇవ్వాలని కోరుకునే వ్యక్తినని వివరించారు. జగన్... సంక్షేమ పథకాలకు ఇచ్చేది మీ డబ్బే... ఆయన తన జేబు నుంచి ఇవ్వడంలేదని అన్నారు. సంపద సృష్టించకుండా కేవలం పథకాలు మాత్రమే ఇవ్వడాన్ని తాను వ్యతిరేకిస్తానని స్పష్టం చేశారు.

రక్తపు మడుగులో పోలీస్ కుటుంబం

- భార్యా, పిల్లల్ని చంపి... ఆపై కానిస్టేబుల్ ఆత్మహత్య
- కడపలో దారుణ ఘటన

విశాలాంధ్ర-కడప: కడపలో దారుణం చోటు చేసుకుంది. కడప టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో రైటర్‌గా పనిచేస్తున్న హెడ్ కానిస్టేబుల్ టీ వెంకటేశ్వర్లు తన సర్వీస్ రివాల్వర్‌తో భార్యతో పాటు ఇద్దరు ఆడపిల్లలను కాల్చిచంపాడు. అనంతరం తనకు తాను కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. 1993 బ్యాచ్‌కు చెందిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లుకు భార్య మాధవి (55)తో పాటు డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న లకన్య (21), పదో తరగతి చదువుతున్న అభాజ్ఞ (16) ఉన్నారు. కడప నగరం చిన్న చౌక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎన్జీవో కాలనీ వాసవి గ్రాఫిక్స్ వీధిలో నివాసం ఉంటున్నారు. బుధవారం రాత్రి 11 గంటలకు కూడా విధులు నిర్వహించి ఇంటికి వచ్చిన వెంకటేశ్వర్లు ఏమి జరిగిందో ఏమో కానీ ఇంట్లో ఉన్న భార్యతో పాటు ఇద్దరు పిల్లలను కాల్చి తాను కూడా ఆత్మహత్యకు పాల్పడినట్లు గురువారం ఉదయం పోలీసులు గుర్తించారు. సమాచారం అందుకున్న కడప జిల్లా ఎస్పీ సిద్ధార్థ కౌశల్, కడప డీఎస్పీ షరీఫ్ తో కలిసి వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కాల్పులకు ఉపయోగించిన రివాల్వర్‌తోపాటు అక్కడ కొన్ని స్టాంపు పేపర్లను, వెంకటేశ్వర్లు రాసిన సూసైడ్ కాగితాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వెంకటేశ్వర్లు కడప టూ టౌన్ పోలీస్‌స్టేషన్లో రైటర్‌గా పనిచేస్తున్నందున రివాల్వర్ కూడా తన స్వాధీనంలో ఉండడం తో దీనిని తన ఇంటికి తీసుకుని వచ్చి కాల్పులకు పాల్పడినట్లు పోలీసులు గుర్తించారు., బుధవారం రాత్రి 11 గంటలకు నుంచి 12 గంటలు మధ్య ఈ ఘటన జరిగి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. వెంకటేశ్వర్లు రాసిన స్టాంపు పేపర్లపై కొనుగోలు చేసిన తేదీ 26/6/23 ఉండగా... 4/10/23 తేదీన సూసైడ్ నోట్ రాసినట్లు పోలీసులు గుర్తించారు. ఒకే రూమ్‌లో బెడ్‌పై ముగ్గురు బుల్లెట్ గాయాలతో విగత జీవులయి ఉండగా... హెడ్ కానిస్టేబుల్ మాత్రం కిందపడి ఉన్నాడు. కాల్పులకు ఉపయోగించిన రివాల్వర్ మాత్రం పక్కనే రూమ్ లో ఉన్న స్టూల్ పై పెట్టుంది. హెడ్ కానిస్టేబుల్ కాల్పులకు తెగబడిన సమయంలో భార్యా పిల్లలకు మత్తులో జారుకునే విధంగా ఏమైనా పాయిజన్ ఇచ్చారా లేక అందరూ మేల్కొన్న సమయంలోనే కాల్చాడా అన్నది పోస్టుమార్టం అనంతరం తెలుస్తుందని పోలీసులు తెలిపారు. వెంకటేశ్వర్లు తాను రాసిన సూసైడ్ నోట్‌లో... నా రెండో భార్య అయిన కడపనగరం రాజారెడ్డి వీధి చెందిన ఏరాసు రమాదేవికి మరణాంతం తనకు రావలసిన బెనిఫిట్స్ అన్ని చెందేలా చూడాలని పేర్కొన్నాడు. అక్కడ దొరికిన మరో డాక్యుమెంట్ నోట్ లో ఏరాసు రమాదేవి భర్త లేటు ఏరాసు నాగేశ్వర్ రెడ్డి అని ఉండడం గమనార్హం. దీంతో వీరి కుటుంబాల్లో జరిగిన గొడవలే కాల్పులకు దారి తీసుంటాయని పోలీసులు అనుమానిస్తున్నారు. మృతి చెందిన హెడ్ కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు చాలా సౌమ్యుడని... ఎప్పుడూ కూడా అతనిపై ఎటువంటి ఫిర్యాదులు లేవని డీఎస్పీ షరీఫ్ తెలిపారు. ఘటన జరిగిన ఇంటిలోని బెడ్ రూమ్ లోకి మీడియాను పోలీసులు అనుమతించలేదు. మృతదేహాలను ఫోటోలు తీయకుండా పోలీసులు అడ్డుకున్నారు. ఉదయం నుంచే వెంకటేశ్వర్లు ఇంటి వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. మృతదేహాలను రిమ్స్ హాస్పిటల్ కు పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. ఈ ఘటనపై పోలీసులు అన్ని కోణాల్లోనూ విచారిస్తున్నారు.

చంద్రబాబుకు ప్రవాసాంధ్రుల అండ

ఎన్నారై బొట్టు వంశీ

విశాలాంధ్ర-చాట్రాయి: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడుకు ప్రపంచదేశాల్లో ఉన్న ప్రవాసాంధ్రులు అండగా నిలిచారని, ఆయన అక్రమ అరెస్టును నిరసించారని టీడీపీ ఎన్నారై విభాగం నాయకులు బొట్టు వంశీ తెలిపారు. ఏలూరు జిల్లా చాట్రాయి మండలం చీపురుగూడెం గ్రామానికి చెందిన బొట్టు విజయ్ చౌదరి తనయుడు బొట్టు వంశీ టీడీపీ ఎన్నారై విభాగంలో క్రియాశీల పాత్ర పోషిస్తున్నారు. చంద్రబాబు అరెస్టుపై ఆయన విశాలాంధ్రతో మాట్లాడుతూ చంద్రబాబు పాలనా కాలంలో ఆంధ్ర, తెలంగాణ ప్రాంతాలకు చెందిన వేలాదిమంది యువతీయువకులు విదేశాలలో విద్యనభ్యసించారని, విదేశాల్లో స్థిరపడ్డారని చెప్పారు. చంద్రబాబు ప్రోత్సాహంతో ఎన్నో నిరుపేద కుటుంబాల్లో ఆర్థిక వెలుగులు వెదజల్లాయని వివరించారు. కొత్త అవకాశాలను యువత ముందుకు తీసుకొచ్చిన చంద్రబాబుకు అమెరికాలో ఉన్న ఎన్నారై విభాగంలో 34 కమిటీలు...30 వేల మంది సభ్యులు అండగా నిలిచారన్నారు. చంద్రబాబుకు అన్ని రకాల సహాయ సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. పది దేశాల్లో ఎన్నారై విభాగం పని చేస్తున్నదని చెప్పారు. అభివృద్ధి నిరోధకుడు ముఖ్యమంత్రి జగన్...చంద్రబాబుకు వస్తున్న ప్రజాదరణను ఓర్వలేక అక్రమ కేసులు బనాయించారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ గెలుస్తుందన్న భయంతో కుట్రపూరితంగా చంద్రబాబును జైలుకు పంపారన్నారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ విజయం తథ్యమన్నారు.

వేతనాల కోసం ఉపాధ్యాయుల పడిగాపులు

ఖజానా కార్యాలయం డైరెక్టర్‌కు తిమ్మన్న వినతి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రోజు నుంచి 13 లక్షల మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు వేతనాల కోసం ప్రతినెలా పడిగాపులు పడాల్సి వస్తోందని ఎస్టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హెచ్.తిమ్మన్న విమర్శించారు. మంగళగిరి నిధి భవన్‌లో రాష్ట్ర ఖజానా కార్యాలయం డైరెక్టర్ ఎన్.మోహన్‌రావుకు ఎస్టీయూ నేతలు వినతిపత్రం అందజేసి...సమస్యలపై చర్చించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, వారి కుటుంబాలు ప్రతినెలా వేతనాల కోసం ఎదురుచూడటం, నెలసరి వాయిదాలు చెల్లించలేక బ్యాంకులకు పినాల్టీ కట్టడం సర్వసాధారణమైందని తెలిపారు. ఈ పరిస్థితులు ఎప్పుడు మారుతాయా అని అందరూ ఎదురు చూస్తున్నారన్నారు. ఉపాధ్యాయుల ఆర్థిక ప్రయోజనాలైన 11వ పీఆర్సీ బకాయిలు, మూడు విడతల కరువు భత్యం, రెండేళ్లుగా చెల్లింపునకు నోచుకోని సంపాదిత సెలవు నగదీకరణ బిల్లులు, భవిష్య నిధి రుణాలు, జీవిత బీమా చెల్లింపులు తదితర ఆర్థిక ప్రయోజనాలు సంవత్సరాల తరబడి పెండింగ్‌లో ఉండటం విద్యాశాఖ చరిత్రలో ఇదే మొదటిసారని వివరించారు. ఉపాధ్యాయులు, ఉద్యోగులందరూ దిగువ మధ్యతరగతి ప్రజలేనని, వారికి ఆర్థిక ఇబ్బందులు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వానికి లేదా అని ప్రశ్నించారు. ప్రతి నెలా వేతనం ఎప్పుడు వస్తుందో తెలియని అనిశ్చితిలో ఉపాధ్యాయులు మానసికక్షోభ అనుభవిస్తున్నారని, దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించాలన్నారు. 5వ తేదీ నాటికి కూడా ఏ ఒక్క ఉపాధ్యాయునికి వేతనం చెల్లించలేదని వివరించారు. ఒకటో తేదీన అందాల్సిన వేతనం 15వ తేదీ వరకు రాకపోవడం ఎంతవరకు సమంజసమని నిలదీశారు. క్యాడర్ స్ట్రెంత్ పేరుతో 5వేల మంది ఉపాధ్యాయులకు నాలుగు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, విద్యాశాఖ కమిషనర్, రాష్ట్ర ఖజానా శాఖ, సీఎఫ్‌ఎంఎస్ శాఖ సమన్వయ లోపమే దీనికి ప్రధాన కారణమని విమర్శించారు. ఖజానా కార్యాలయం డైరెక్టర్‌ను కలిసిన వారిలో ఎస్టీయూ నాయకులు వేణుగోపాల్ ఉన్నారు.

ట్రాన్స్‌కో లైన్లు ప్రైవేట్‌కు ఇవ్వొద్దు

ఓబులేసు డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ట్రాన్స్‌కో పరిధిలో జరిగే విద్యుత్ లైన్లు, సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులను ప్రైవేటుకు అప్పగించవద్దని ఏఐటీయూసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.ఓబులేసు గురువారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కాస్ట్ బెస్ట్ టారిఫ్ బిల్డింగ్(సీబీటీబీ) విధానంలో పనులు కేటాయించడంతో పాటు వాటి నిర్వహణ బాధ్యతను ప్రైవేటు గుత్తేదారులకే అప్పగించనున్నారని విమర్శించారు. సీబీటీబీ విధానం కింద రూ.100 కోట్లు దాటిన ప్రాజెక్టు పనులు కేటాయించే ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణ మండలి(ఏపీఈఆర్‌సీ) పరిశీలిస్తుందని, దీనికి అవసరమైన ముసాయిదా మార్గదర్శకాలు సిద్ధం చేసిందని వివరించారు. కొత్త మార్గదర్శకాలు అమలులోకి వస్తే ఇప్పటివరకు ఏపీ ట్రాన్స్‌కో నిర్వహణలో ఉన్న లైన్లు, సబ్ స్టేషన్లు ప్రైవేటు సంస్థల చేతుల్లోకి వెళతాయన్నారు. ట్రాన్స్‌కో లైన్లు ప్రైవేట్ గుత్తేదారులకు అప్పగించాలన్న ఆలోచనను ఏఐటీయూసీ, దాని అనుబంధ సంఘం ఏపీ ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్ యూనియన్ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నదని తెలిపారు. ప్రత్యామ్నాయంగా రూ.500 కోట్లు దాటిన ప్రాజెక్టును సీబీడీబీ విధానంలో కేటాయించే అంశాన్ని పరిశీలిస్తుందన్నారు. ఈ పనులకు సంబంధించిన ప్రతిపాదలను రూపొందించి ఏపీ ఈఆర్‌సీ నుంచి ధరల ఆమోదం పొందిన తర్వాత టెండర్లు పిలిచి పనులు అప్పగిస్తుందన్నారు. ఆ తర్వాత వాటి నిర్వహణ మళ్లీ ట్రాన్స్‌కో పరిధిలోనే ఉంటుందని తెలిపారు. అదనంగా ఖర్చు చేయాల్సి వస్తే ట్రూ ఆప్ చార్జీలతో కలిపి వినియోగదారులపైనే భారం వేస్తున్నారని విమర్శించారు. సీబీడీబీ విధానంలో కేటాయించే పనులకు అంచనా మొత్తాన్ని గుత్తేదారుల సంస్థ వేస్తుందన్నారు. రోడ్డు నిర్మాణంలో నివాస వినియోగ ధరల నుంచి నిర్దేశిత వ్యవధికి టోల్ వసూలు చేసే విధానాన్ని ఇక్కడ అమలు చేయనున్నారని తెలిపారు.

కేసుల కోసం రాష్ట్రం తాకట్టు

జగన్‌పై లోకేశ్ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో- అమరావతి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై ఎక్స్ వేదికగా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ విమర్శలు గుప్పించారు. జగన్ చేసిన పాపాలు రాయలసీమకు శాపాలుగా మారుతున్నాయని ఆరోపించారు. జగన్ నేరాలు ఆంధ్రప్రదేశ్ ప్రయోజనాలకు ఉరితాళ్లు అయ్యాయని పేర్కొన్నారు. అక్రమాస్తుల కేసుల మాఫీ కోసం ప్రత్యేక హోదా వదులుకున్నాడని, విశాఖలో రిషికొండకు గుండుకొట్టిన కేసు నుంచి తప్పించుకునేందుకు రైల్వేజోన్‌కి నీళ్లొదిలాడని, బాబాయ్‌ని చంపించిన కేసులో తమ్ముడిని రక్షించుకునేందుకు ఏకంగా ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం ప్రాజెక్టుని ప్రశ్నార్థకం చేశాడని విమర్శలు గుప్పించారు. రాయలసీమ బిడ్డనంటూ కేన్సర్ గడ్డలా పీడిస్తున్నాడని మండిపడ్డారు. జగన్ ప్రభుత్వం దారుణ వైఫల్యం వల్లే కృష్ణాజలాల కేటాయింపులు పునఃసమీక్ష జరుగుతోందని పేర్కొన్నారు. జగన్‌కి ఇచ్చిన ఒక్క చాన్స్‌తో ఏమేమి కోల్పోయారో గుర్తించండని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సాగు, తాగునీటి అవసరాలు తీర్చే కృష్ణాజలాలలో న్యాయబద్ధమైన వాటా కోల్పోతే రాయలసీమ ఎడారిగా మారే ప్రమాదం ఉందని లోకేశ్ హెచ్చరించారు.

ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్‌లో చేర్చాలి

ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఏపీ పీటీడీ (ఆర్టీసీ)లోని వివిధ విభాగాలలో పనిచేసే సుమారు ఎనిమిది వేల మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను ఆప్కాస్ లో చేర్చి, వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ జేఏసీ అమరావతి డిమాండ్ చేసింది. గురువారం విజయవాడ రెవిన్యూ భవన్‌లో ఏపీ జేఏసీ అమరావతి సమావేశాన్ని నిర్వహించారు. ఏపీ జేఏసీ రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు, సెక్రటరీ జనరల్, ఏపీ పీటీడీ (ఆర్టీసీ)ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పలిశెట్టి దామోదర రావు మాట్లాడుతూ... ఆర్టీసీలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరికీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఆప్కాస్‌లో చేర్పించాలన్నారు. రాష్ట్రంలోని సుమారు లక్ష మంది అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు కల్పించిన తరహాగా, వారికికూడా ఉద్యోగ భద్రత కల్పించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ఈ సమస్యను ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఆర్టీసీలో పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వం, ఆర్టీసీ ఎండీ సానుకూలంగా ఉన్నారని చెప్పారు. వాటిని సాధించుకోవడం కోసం అవుట్ సోర్శింగు ఉద్యోగులంతా ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. అందుకుగాను ప్రభుత్వం దృష్టికి కొన్ని డిమాండ్లు తీసుకెళ్తామని వివరించారు. ఆర్టీసీ లో పనిచేస్తున్న స్కిల్డ్, సెమీస్కిల్డ్, అన్ స్కిల్డ్, డేటా ఎంట్రీ ఆపరేటర్ల తదితర సుమారు ఎనిమిది వేలు మందిని ఆప్కాస్ లో కలపాలన్నారు. అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు సీనియార్టీ ప్రకారం వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ కార్డులు అందరికీ జారీ చేయాలని, కాంట్రాక్టర్ల దళారీ వ్యవస్థ నుంచి ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులకు విముక్తి కలిగించి, ప్రభుత్వం లేదా ఆర్టీసీ యాజమాన్యం ద్వారా ప్రతినెలా మొదటి వారంలోనే వేతనాలు చెల్లించేలా చూడాలని ఈ సమావేశం ద్వారా ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆర్టీసీ అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ఏపీ జేఏసీ అమరావతి, ఆర్టీసీ ఎంప్లాయీస్ రాష్ట్ర కమిటీ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈసమావేశంలో ఏపీ జేఏసీ అమరావతి అసోషియేట్ చైర్మన్ టీవీ ఫణి పేర్రాజు, ఆర్టీసీ ఈయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జీవీ నరసయ్య, ఏపీ కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల జేఏసీ చైర్మన్ కే సుమన్ పాల్గొన్నారు.

14, 15 తేదీల్లో ఏపీ రిజర్వుడు ఎస్ఐ తుది రాత పరీక్షలు



విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: ఆంధ్రప్రదేశ్ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ అధ్వర్యంలో భర్తీ చేయబోయే రిజర్వుడు ఎస్ఐ (సివిల్- మెన్, ఉమెన్), ఏపీఎస్ పీఎస్ఐ (మెన్) పోస్టులకు తుది విడత రాత పరీక్షలను ఈనెల 14, 15 తేదీల్లో నిర్వహించనున్నారు. ఈ మేరకు బోర్డు చైర్మన్ అతుల్ సింగ్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. నాలుగు పేపర్లతో పరీక్షను నిర్వహిస్తారు. 14వ తేదీ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-2ను డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహిస్తారు. 15వ తేదీన ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పేపర్-3, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు పేపర్-4ను ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష ఉంటుంది. విశాఖ, ఏలూరు, గుంటూరు, కర్నూలులో పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. పరీక్షలకు హాజరు కాబోయే మొత్తం 31,193 మందిలో పురుషులు- 27,500 మంది, మహిళలు 3603 మంది చొప్పున ఉన్నారు. అంతకుముందు ఆగస్టు 25 నుంచి సెప్టెంబర్ 25 వరకు దేహదారుఢ్య పరీక్షలు నిర్వహించిన విషయం విదితమే. అందులో అర్హత పొందిన అభ్యర్థులను తుది విడత రాత పరీక్షలకు ఎంపిక చేశారు. ఈ పరీక్షల పూర్తి సమాచారాన్ని 'sipvb.ap.gov.in' వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచారు.

రెండేళ్లలో బాల్య వివాహాలు లేని రాష్ట్రంగా ఏపీ

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట): 2025 నాటికి బాల్యవివాహాలు లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని ఏపీయస్‌సీపీసీఆర్ చైర్మన్ డాక్టర్ కేసరి అప్పారావు పిలుపునిచ్చారు. భారతదేశంలో 2030 నాటికి బాల్య వివాహాలను అంతం చేయాలనే లక్ష్యంతో బచ్‌పన్ బచావో ఆందోళన్ (బీబీఏ) ఆంధ్రప్రదేశ్ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (ఏపీయస్ యల్‌యస్‌ఏ) శాఖ సహకారంతో రాష్ట్ర ఆంధ్రప్రదేశ్ స్టేట్ కమీషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఏపీయస్ సీపీసీఆర్), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)తో సంప్రదింపులు జరిపిందని తెలిపారు. ఈ సందర్భంగా నగరంలో ఒక హోటల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డాక్టర్ అప్పారావు మాట్లాడుతూ... బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాటాన్ని తీవ్రతరం చేసేందుకు వివిధ ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలు ఈ సంప్రదింపులలో పాల్గొన్నాయన్నారు. బాల్య వివాహ రహిత భారతదేశం అనే విశాల దృక్పథం కింద బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేయడంలో బాలల రక్షణలో భాగస్వాములైన వారందరినీ సమీకరించడం, బాల్య వివాహ రహిత ఆంధ్రప్రదేశ్‌ను సాకారం చేయడంలో సహాయం చేయడం దీని లక్ష్యమన్నారు. బీబీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధనంజయ్ తింగల్ మాట్లాడుతూ... గత ఏడాది దేశ వ్యాప్తంగా 7028 గ్రామాల్లో 76000 మంది మహిళలు బాల్య వివాహాలకు వ్యతిరేకంగా ఒకేరోజు వీధుల్లోకి వచ్చారని గుర్తుచేశారు. ఈ సంప్రదింపులు 20 రాష్ట్రాలలో జరుగుతాయని... 2030 నాటికి భారతదేశాన్ని బాల్య వివాహ రహితంగా మార్చాలనే మా సామూహిక కలను సాకారం చేసే దిశగా ఇది మరో ముందడుగన్నారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ జానకి మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టేందుకు ఆమె త్రిముఖ వ్యూహాన్ని రూపొందించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో బీవీడీ ప్రసాద మూర్తి (జువైనల్ వెల్ఫేర్ కరెక్షనల్ సర్వీసెస్ అండ్ వెల్ఫేర్ ఆఫ్ స్ట్రీట్ చిల్డ్రన్ డైరెక్టర్), ఎం.బబిత (సభ్య కార్యదర్శి, ఏపియస్‌యల్‌యస్‌ఏ), శ్రీనివాసులు(సెర్ప్ డైరెక్టర్), పి పార్వతి (డైరెక్టర్, కోఆర్డినేషన్, విద్యా శాఖ) పి మాధురి (పంచాయతీ రాజ్ శాఖ), యం మోహన్ రావు (డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్, సి.ఐ.డి), ప్రొఫెసర్ సరస్వతి రాజు అయ్యర్ (సోషియాలజీ & సోషల్ వర్క్ ప్రొఫెసర్, కోఆర్డినేటర్, సెంటర్ ఫర్ కమ్యూనిటీ సోషల్ రెస్పాన్సిబిలిటీ, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం), డాక్టర్ ఫ్రాన్సిస్ తంబి (సెక్రటరీ, ప్రో చైల్డ్ గ్రూప్ అండ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ సిఆర్‌ఏయఫ్), బీ ప్రతాప్ రెడ్డి (డైరెక్టర్, ఎస్‌సీఆర్‌టి), జుబేదా బేగం (చైర్‌పర్సన్, సిడబ్లుసి, కర్నూలు) తదితర ప్రముఖులు పాల్గొన్నారు.

టీడీపీ-జనసేన కలయిక ఓ వైరస్

గృహనిర్మాణ శాఖ మంత్రి జోగి రమేశ్

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: టీడీపీ-జనసేన కలయిక వాక్సిన్ కాదని, అది ఓ వైరస్ అని గృహ నిర్మాణశాఖ మంత్రి జోగి రమేశ్ విమర్శించారు. పవన్-చంద్రబాబు కలయిక అపవిత్రమన్నారు. తాడేపల్లి వైసీపీ కేంద్ర కార్యాలయంలో గురువారం మంత్రి జోగి రమేశ్ విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. పవన్ కల్యాణ్ పెడన సభ అట్టర్‌ఫ్లాప్ అయిందన్నారు. పెడనలో ఏదో చేసేయాలని పవన్ చాలా తాపత్రయ పడ్డాడని... రెండు వేల మంది గూండాలను పోగు చేస్తున్నామని, తనపై రాళ్ల దాడి జరుగుతుందని ఆవేశంగా ఆరోపించాడని గుర్తుచేశారు. పెడనలో పవన్ బహిరంగసభకు కనీసం రెండు వేల మంది సైతం రాలేదన్నారు. అతనివి గాలి మాటలని తేలిపోయిందని... గాలి పోగేసి ఆరోపణలు చేస్తాడని పెడన సభ చూస్తే ప్రజలకు అర్థమైందని వివరించారు. పొత్తులు పెట్టుకున్న తర్వాత జరుగుతున్న వారాహి యాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడతారని పవన్ భావించాడని... అవనిగడ్డలో పొత్తు ప్రకటన తర్వాత జరిగిన తొలి సభలోనే జనం ఆయన్ను ఆదరించలేదన్నారు. దీంతో అందరి దృష్టిని ఆకర్షించేందుకు పెడనలో తనపై దాడికి ప్లాన్ చేస్తున్నారని ఆరోపించాడని... అక్కడ కూడా ఆయన సభ అట్టర్‌ఫ్లాప్ అయిందని చెప్పారు. తెలుగుదేశం- జనసేన కలిసి వచ్చినా, కనీసం రెండు వేల మందిని సభకు రప్పించలేకపోయారని, అది మీకు పట్టిన ఖర్మ అని విమర్శించారు. ప్రజలు సంతోషంగా ఉన్నారని, జగన్ పాలన ఇంకా కావాలని వారంతా కోరుకుంటున్నారని స్పష్టం చేశారు.

సంపాదకీయం

ఆపరేషన్ జైల్

ఆర్థిక శాఖలో భాగమైన ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ (ఇ.డి.) ఇష్టారాజ్యం కొనసాగుతూనే ఉంది. గత ఆగస్టులో సుప్రీంకోర్టు ఛత్తీస్ గఢ్ మద్యం కుంభకోణం వ్యవహారంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ఇష్టానుసారం వ్యవహరించడానికి వీలులేదని గట్టిగానే చెప్పింది. అయితే ప్రస్తుత పరిస్థితుల్లో కేంద్ర ప్రభుత్వ అధీనంలోని దర్యాప్తు సంస్థలన్నీ ప్రధానమంత్రి మోదీ కనుసన్నల్లో మెలగుతాయి. బీజేపీకి ప్రత్యర్థులైన రాజకీయ పార్టీల నేతలమీద కక్ష తీర్చుకోవడంలో కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ అధినేతల ఆదేశాల మేరకే నడుచుకుంటాయి. సుప్రీంకోర్టు ఆదేశాలను అందుకే ఈ దర్యాప్తు సంస్థలన్నీ తుంగలో తొక్కుతాయి. దిల్లీ మద్యం కుంభకోణంలో కూడా ఇలాగే సాగుతోంది. ఈ కేసులో ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుల మీద కక్షతీర్చుకోవడానికి ఆ పార్టీకి చెందిన మంత్రులను, సీనియర్ నాయకులను అరెస్టు చేస్తూనే ఉన్నారు. తాజాగా ఆమ్‌ఆద్మీ పార్టీ రాజ్యసభ సభ్యుడు సంజయ్ సింగ్‌ను బుధవారం అరెస్టు చేశారు. అంతకు ముందు ఆయనను దాదాపు తొమ్మిది గంటలపాటు విచారించి చివరకు సాయంత్రం అరెస్టు చేశారు. వీరందరిమీద అక్రమ సంపాదనను చెలామణీలోకి తేవడాన్ని నిరోధించే చట్టం(పి.ఎం.ఎల్.ఎ.) కింద కేసులు నమోదు చేశారు. అంతకు ముందే దిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీ మంత్రి మనీశ్ సిసోడియాను గత ఫిబ్రవరిలో అరెస్టు చేశారు. అప్పటి నుంచి ఆయన జైలులోనే మగ్గుతున్నారు. బెయిలు కూడా మంజూరు కావడం లేదు. ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు విజయ్ నాయర్‌నూ దిల్లీ మద్యం కేసులోనే అరెస్టు చేశారు. ఆమ్ ఆద్మీపార్టీ సత్యేంద్ర జైన్‌ను కూడా డబ్బు దుర్వినియోగం కేసులో అరెస్టు చేశారు. ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ను ఇదే కేసులో తొమ్మిది గంటలపాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ప్రశ్నించింది. ఆయనను అరెస్టు చేసినా ఆశ్చర్యపడవలసింది ఏమీలేదు. దిల్లీ మద్యం కేసులోనే భారతీయ రాష్ట్ర సమితి (బి.ఆర్.ఎస్. – మునుపు టి.ఆర్.ఎస్.) నాయకురాలు కల్వకుంట్ల కవితను కూడా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ ప్రశ్నించింది. కేంద్ర ప్రభుత్వానికి, బి.ఆర్.ఎస్. అధినేత కె.చంద్ర శేఖరరావుకు మధ్య ఉన్న రాజకీయ విభేదాలనుబట్టి చూస్తే కవితను అరెస్టుచేసినా అడిగే దిక్కులేదు. గత సంవత్సరం జులై నుంచి దిల్లీ మద్యం కేసులో దర్యాప్తులు, అరెస్టులు కొనసాగుతూనే ఉన్నాయి. ఈ కేసులు, ఆరోపణలు, అరెస్టులు, కూట సాక్ష్యాలు ఈ మధ్య కాలంలో మళ్లీ వేగం పుంజుకున్నాయి. ఎందుకంటే అయిదు రాష్ట్రాలలో త్వరలో శాసనసభలకు ఎన్నికలు జరగాల్సిఉంది. ఆ తరవాత 2024 ఏప్రిల్–మేలో సార్వత్రిక ఎన్నికలు జరుగుతాయి. ఎన్నికల సర్వేలను సంపూర్ణంగా నమ్మవలసిన అగత్యం లేకపోవచ్చు. ఆ నివేదికలు నిజమైన సందర్భాలు ఉన్నట్టే విఫలమైన ఉదంతాలూ ఉన్నాయి. ఈ సర్వేలన్నీ అయిదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలలో ఆ తరవాత జరిగే సార్వత్రిక ఎన్నికలలోనూ బీజేపీ బలహీనపడే సూచనలున్నాయని ఈ సర్వేలు ఘోషిస్తున్నాయి. బీజేపీ సొంతంగా చేయించుకుంటున్న సర్వేలు కూడా అంత ఆశాజనకంగా కనిపించడం లేదు. మోదీ అధికారంలోకి వచ్చిన తరవాత కాంగ్రెస్ ముక్త్‌భారత్ నినాదం ఇచ్చారు. ఇప్పుడు ఆయన ప్రతిపక్షాల ముక్త్‌భారత్ దిశగా ప్రయాణిస్తున్నారు. అందువల్ల ప్రతిపక్షం అధికారంలో ఉన్న అన్ని రాష్ట్రాలలో, ముఖ్యమంత్రులలో, వారి అనుయాయులలో, అనుచరులలో ఎవరో ఒకరిమీద సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టొరేట్ చేత దాడులు చేయించి మొత్తం ప్రతిపక్షాలనే బోనులో నిలబెడ్తున్నారు. మోదీ సాధించి చూపింది ఏమీ లేకపోవడంవల్ల ప్రతిపక్షాలను అపఖ్యాతిపాలు చేయాలని నిరంతరం ప్రయత్నిస్తూనే ఉన్నారు. ఈ ప్రయత్నంలో భాగంగానే సంజయ్ సింగ్ అరెస్టు.

అక్రమార్జన చెలామణి నిరోధక చట్టం కూడా కిరాతకమైంది. బెయిలు ఇవ్వడానికి కూడా న్యాయమూర్తులు సిద్ధ పడడంలేదు. దిల్లీ మద్యం కుంభకోణంపేర ఇంతకు ముందు 11 మందిని అరెస్టు చేశారు. మరికొందరు నాయకుల మీద దర్యాప్తు నాటకం కొనసాగుతోంది. ఆరోపణలకు గురైన వారిమీద నిరంతరం అరెస్టు కత్తి వేలాడుతూనే ఉంది. అలా వేలాడుతూ ఉండేట్టు చేయడమే మోదీ ప్రభుత్వ లక్ష్యం. మద్యం కుంభకోణంలో మొత్తం ఆమ్ ఆద్మీ పార్టీనే దోషిగా నిలబెట్టే కుట్రసాగుతోంది. ఈ మద్యం కేసును మొదట సీబీఐ దర్యాప్తు చేసింది. ఆ తరవాత ఇ.డి. దర్యాప్తు చేయడం మొదలుపెట్టింది. అనుమానంవచ్చిన నాయకులపై గంటలకొద్దీ ప్రశ్నలవర్షం కురిపించినా నికరమైన ఆధారాలు ఏమీ దొరుకుతున్నట్టులేదు. అందువల్ల ఇదే కేసులో అరెస్టయి అప్రూవరుగా మారిన దినేశ్ అరోరా వెల్లడిస్తున్న అంశాల ఆధారంగానే సంజయ్‌సింగ్‌ను అరెస్టు చేశారు. బెయిలు కోసం సిసోడియా పెట్టుకున్న దరఖాస్తుపై విచారణ జరుపుతున్న సుప్రీంకోర్టు కూడా సిసోడియాకు అక్రమార్జన సొమ్మును చెలామణి చేశారనడానికి రుజువు లేదుగా అని నిలదీయాల్సిన పరిస్థితి వచ్చింది. దిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు సంబంధం ఉందని మనీశ్ సిసోడియా చేత చెప్పించడానికి తీవ్ర ప్రయత్నం జరుగుతోంది. సంజయ్ సింగ్ మీదా అదే ఒత్తిడి తేవచ్చు. నిందితుల వాంగ్మూలాల ఆధారంగా అరెస్టులు కొనసాగుతున్నాయంటే దర్యాప్తు సంస్థల విచారణలో సత్తాలోని డొల్లతనం బయటపడ్తోంది. కేసులు మోపడానికి అవకాశంలేని సందర్భంలోనూ అధికార పీఠాలెక్కిన వారి తరఫున తలారులుగా పనిచేసే స్థాయికి దర్యాప్తు సంస్థలు దిగజారినప్పుడు ఇంతకన్నా మెరుగైన పరిస్థితి ఉంటుందనుకోవడం భ్రమ. రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు జరగడానికి రెండు నెలలకన్నా తక్కువ సమయమే ఉంది కనక ప్రతిపక్ష పార్టీలను బోనెక్కించడానికి బీజేపీ తొందరపడుతోంది. జార్ఖండ్ ముఖ్యమంత్రికి ఇ.డి. ఇప్పటికి అయిదుసార్లు నోటీసులు జారీచేసింది. ఆయన హాజరు కావడం లేదు. ఆయన మీద దాడి చేయొచ్చు. దర్యాప్తుకోసం పిలిపించో, ఇంటిమీద దాడిచేసో ఆయననూ అరెస్టుచేసే అవకాశం లేకపోలేదు. చత్తీస్ గఢ్ ముఖ్యమంత్రి భూపేశ్ బఘేల్ రాజకీయ సలహాదారు, ఇతర సీనియర్ అధికారుల మీద సోదాలు కొనసాగుతూనే ఉన్నాయి. మద్యం కుంభకోణంలో నొక్కేసిన డబ్బు ఆమ్ ఆద్మీ పార్టీ గోవా ఎన్నికలకోసం వెచ్చించిందట. అంత సామర్థ్యంఉన్న ఇ.డి. మరి పి.ఎం.కేర్స్‌కు అందుతున్న నిధులు ఎలా ఖర్చుపెడ్తున్నారో కూడా బయట పెట్టొచ్చుగా! మద్యం కుంభకోణంలో అసలు సూత్రధారి కూడా త్వరలో బయటపడ్తారని కేంద్ర సమాచార శాఖమంత్రి అనురాగ్ ఠాకూర్ అనడం చూస్తే తరవాత వంతు కేజ్రీవాల్‌దే కావచ్చు. ఏమైతేనేం ఆపరేషన్ జైల్ ద్వారా ఎన్నికలలో గట్టెక్కాలన్నది బీజేపీ అగ్రనేతల కుట్ర.

మానవ హక్కుల్ని హరించే జమిలి ఎన్నికలు

హక్కులు పోతున్నాయి రాజ్యాంగ ప్రతులు తగలుపెట్టరా నరుడా బానిసగ మారరా సోదరా... ఏంటి బావ నరుడా సోదరుడా అని పల్లవి అందుకున్నావ్ ఏంటి కథ. మళ్లీ ఈ రోజు ఏం మోసుకొచ్చావయ్యా నాకు కూడ కొంచెం చెప్పవయ్యా విని సంతోషిస్తాను. అదే మరి నీతో నాకు పడని విషయం. అన్ని పేపర్లు తిరగేస్తావ్. నువు కూడా అప్పుడప్పుడు పేపర్లకు వ్యాసాలు రాస్తావ్. కాని ఏమి తెలియనట్లు మాట్లాడతావు. నిజమేనయ్యా మానవుడా మేలుకో అని పాడవయ్య. పౌర హక్కులు హరించిపోతుంటే నిద్రపోతున్న మానవాళిని మేల్కొపవలసిన అగత్యం ఏర్పడింది. అయిదు సంవత్సరాలు పాలించమని ఎన్నుకున్న ప్రభుత్వాలకు ఆరునెలలముందే జమిలి ఎన్నికల పేరిట ఎన్నికలు జరపటం మానవహక్కుల్ని హరించడమే. అలాగే ప్రజావ్యతిరేక పాలనచేస్తున్న ప్రభుత్వానికి మరో ఆరునెలలు పొడిగించడం హర్షణీయంకాదు. మోదీ ప్రభుత్వం 2024నాటికి జమిలి ఎన్నికలు ప్రవేశపెట్టాలని చూచినా కుదరలేదు. ప్రజలు తమకు కావాలని ఎన్నుకున్న ప్రభుత్వాన్ని దించివేయడం మానవహక్కుల్ని హరించడమే. ప్రజాస్వామ్యానికి తూట్లు పొడవటమే. నిజమె మనది అతి పెద్ద దేశమని చంకలు గుద్దుకుంటూ ప్రజాస్వామ్యాన్ని మంటగల్పి



నియంతపాలన దిశగా అడుగులు వేస్తున్న బీజేపీకి అడ్డుకట్టవేయాలి. నిజమే అసలు ప్రజాస్వామ్య వ్యవస్థలో మనిషి నిమిత్త మాత్రమవుతున్నాడు. అధికారంలోఉన్న పార్టీలు అధికారం కాపాడుకోవడానికి అడ్డదారులు తొక్కుతున్నారు. అంతటితో ఆగక వారు నమ్మిన మతాన్ని ప్రజల నెత్తినరుద్దడానికి వెనుకాడటంలేదు. నిజమే బావ అసలు మనిషికి మతం అవసరమా ఎవరి కిష్టమైన మతాన్ని వారు నమ్మి చేయి చేయి కలిపి సమాజాభివృద్ధికి ఎవరిశక్తిమేర వారు కృషి చేస్తున్నారు. సమాజాభివృద్ధికి మతంతో పనిలేదు సరికదా ఈ మత యుద్ధం వల్ల సమాజం నాశనమవుతోంది.

మతాన్ని ఇంటికే పరిమితం చేయకుండా బజారుకు తేవడంతోనే ప్రజల మధ్య గొడవలు పెరిగి మతసామరస్యాన్ని నాశనం చేస్తున్నారు. అసలు మతం అవసరం లేకుండా జీవనం సాగిస్తున్న మనుషుల మధ్య గొడవలు రేపేది మత సంస్థలే. అటువంటి తరుణంలో హిందూ మతాన్ని ప్రజలందరి నెత్తిన రుద్దడానికి బీజేపీ ప్రయత్నిస్తోంది. అందుకే మనిషికి అవసరంలేని దేవుళ్లను కొలవవలసిన అవసరంలేదని తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుని తల నరికితెస్తే కోట్లు ఇస్తానన్న మనిషిపై చర్యతీసుకోని బీజేపీ ప్రభుత్వం ఉదయనిధిని ఎలా హతమార్చాలా అని ఆలోచిస్తుండటం నిరసించదగింది. అంతేకాదు, గతంలో ఎంతో మంది శాస్త్రవేత్తల్ని పొట్టన పెట్టుకున్న ఈ మతస్థుల ఆటలు సాగనిస్తే ఇకసమాజంలో అభ్యుదయవాదులు మిగలకపోవచ్చు. నిజమే మనిషి నిర్మించుకున్న సమాజంలో మనిషికి విలువలేకపోగా పనికిరాని వాడుగా నిమిత్తమాత్రుడుగ మారడం సమాజ పురోగతికోరే అభ్యుదయవాదులకు గొడ్డలి పెట్టులాంటిది. నిజమే అంతేకాదు ప్రజలెన్నుకున్న ప్రజాప్రతినిధులకు ఎటువంటి అధికారం లేకుండా పోతోంది. 51శాతం ఎంఎల్‌ఏలు విజయం సాధించిన పార్టీ ప్రభుత్వాన్ని ఏర్పాటుచేస్తోంది. ఇందులో 50శాతం మంది శాసనసభ్యులలోనే మంత్రులుగ ఎన్నుకుంటున్నారు. అధికార, ప్రతిపక్ష ఎంఎల్‌ఏలు కలిసి మంత్రులను ఎన్నుకుంటేనే నిజమైన ప్రజాస్వామ్యం అవుతుంది. దేశ అధ్యక్షుని ఎన్నుకున్న తరహాలోనే ప్రతి శాసనసభ్యునికి, ప్రతి ఎంపీకి మంత్రులను ఎన్నుకునే హక్కు ప్రజాస్వామ్యంలో కల్పించాలి. అలా అయినా ఎక్కువమంది గెలిచినవారిలో నే ఎన్నికవుతారుగ బావ, కావచ్చు ప్రభుత్వపాలన నచ్చనిసభ్యులు ప్రతిపక్ష సభ్యులకు ఓటు వేయవచ్చు. ఈ మధ్య జరిగిన శాసనమండలి ఎన్నికలలో వైసీపీ శాసనసభ్యులు ఇద్దరు తెలుగుదేశం అభ్యర్థికి ఓటువేసి దేశం అభ్యర్థిని గెలిపించారుగద. అందుకే ప్రజాస్వామ్య వ్యవస్థలో ప్రతిప్రజాప్రతినిధికి ఎన్నుకునే హక్కు ఉండాలి. అదే నిజమైన ప్రజాస్వామ్యం. అలాకాకుండా ఒకే పార్టీ ఒకే మతం ఉండాలనే బీజేపీని గెలిపించవలసిన అవసరం ఉంది. కాని ఈ మధ్య అధికారంలోఉన్న బీజేపీ లాంటి కొన్ని పార్టీలు తాముచెప్పేది అసలైన ప్రజాస్వామ్యం అంటున్నారు. నియంతపాలన చేసే పార్టీల ప్రజాస్వామ్యం అసలైన ప్రజాస్వామ్యమని నిస్సిగ్గుగా మాట్లాడుతున్నారు. అందులో మాటల మాంత్రికుడు మోది ఆయన సన్నిహితుడు వ్యూహ రచయిత అమిత్ షా అగ్రగణ్యులు. పరిణితితో ప్రతి పౌరుడు తమ హక్కులు కాపాడుకోవడానికి పౌర హక్కుల సంఘాలతో చేతులు కలపాలి.

సెల్: 98855 69394

అజాత శత్రువు తుమ్మల

చెరుకూరి సత్యనారాయణ

ప్రపంచమంతా అక్టోబర్ విప్లవ దినోత్సవం 70వ వార్షికోత్సవం జరుపుకుంటూ మురిసిపోతున్న వేళ ఆంధ్ర దేశంలో అభ్యుదయ సాహిత్యోద్యమం విషాదంతో మునిగిపోయింది. 1987 నవంబర్ 7వ తేది ఆంధ్రాభ్యుదయ రచయితల రథసారథి తుమ్మల వెంకట్రామయ్య కన్నుమూశారు. మార్క్సిజాన్ని తన తాత్విక సిద్ధాంతంగా స్వీకరించిన నాటి నుండి చనిపోయే వరకు దానికోసమే పరితపించిన మహా మనీషి ఆయన. తుమ్మల అజాతశత్రువు అనటంలో ఏమాత్రం అతిశయోక్తి కాదు. 1914 అక్టోబర్ 6వ తేది గుంటూరుజిల్లా తెనాలి తాలూకా కొల్లూరులో జన్మించిన వెంకట్రామయ్య ఆ గ్రామంలోనే ప్రాథమిక, మాధ్యమిక విద్యాభ్యాసం చేశారు. ఈ పాఠశాల నిర్వహణకోసం దాని స్థాపకుడు బ్రహ్మాండం నరసింహం బడి పిల్లల్ని తీసుకొని భిక్షాటన గావించి బియ్యం, డబ్బు సేకరించి ఆ పాఠశాల నడిపేవాడు. రాట్నంమీద నూలు వడకటం, మగ్గంమీద బట్టలు నేయటం, బుక్ బైండింగ్, సబ్బులు, సాంబ్రాణి కడ్డీలు చేయటం లాంటివి నేర్పి అక్కడ చదివిన విద్యార్థులు బ్రిటీష్ పాలకుల గుమస్తాలుగా గాక స్వతంత్రంగా జీవించాలని బోధించారు.

విద్యాభ్యాస కాలంలోనే బ్రాహ్మణేతర ఉద్యమానికి, సంస్కరణలకూ, జస్టిస్ పార్టీ రాజకీయాలకు, జాతీయోద్యమానికి, ఆ గ్రామం కేంద్రంగా వుండేది. వీటితోపాటు పక్క గ్రామమైన అనంతవరంలో హరిజనుల సమస్య తుమ్మలపై గాఢ ప్రభావం కల్గించాయి. 1933 ప్రాంతంలోనే అనంతవరం నుండి దూళిపాళ్ల కోటయ్య నడిపిన కార్మిక ప్రచురణల్లో తుమ్మల రెండు కథలు రాశారు. ఆ తర్వాత కాశి విద్యాపీఠంలో "శాస్త్రి" కోర్సు చదవటానికి వెళ్లారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం లైబ్రరీ నుండి అభ్యుదయ గ్రంథాలు తీసివేయటం, జాతీయోద్యమంలో పాల్గొనే వాతావరణం లేకపోవటంతో చాలామంది విద్యార్థులు కాశీకి వెళ్లేవారు. ఆ సమయంలో బెనారస్ (కాశి) విశ్వవిద్యాలయంలో చంద్ర రాజేశ్వరరావు, చంద్ర రామలింగయ్య, నండూరి ప్రసాదరావు, పొన్నం వీరరాఘవయ్య, మునిపల్లె రామారావు వుండేవారు. సోమూరి వెంకట్రామయ్య కూడా శాస్త్రి కోర్సులో చేరాడు. 4 సంవత్సరాల ఈ కోర్సు మన బి.ఏ లాంటిది. లాల్ బహదూర్ "శాస్త్రి" కూడా ఈ కోర్సు చదివినందునే "శాస్త్రి" అయ్యాడు. ఆ సమయంలో అక్కడ జరిగిన యువజన మహాసభలో పాల్గొనటానికి వచ్చిన యస్.ఎ. డాంగే దగ్గరే తుమ్మల ఆ మూడు రోజులు ఉన్నాడు. బెనారస్‌లో వున్న సమయంలోనే డిమిట్రావ్ జీవితంపై తుమ్మల వ్యాసాలు రాశాడు. దక్షిణాది నుండి శాస్త్రి కోర్సు కోసం వెళ్లిన 30 మందిలో సగం తెలుగువాళ్లే. అప్పుడే (1934 జులై) "మాతృ హృదయం" అనే పేరుతో గోర్కీ మదర్‌ని తెలుగులో తర్జుమా చేశాడు. ఒక సంవత్సరం కాశీలో వుండి తిరిగి ఆంధ్రాకు వచ్చాడు. 36–37 కాలంలో సుందరయ్య సూచనపై మద్రాసు పార్టీ కార్యాలయంలో



పనిచేయటానికి వెళ్లాడు. 1937లో నవశక్తి రాజమండ్రి నుండి ప్రారంభం కావటంతో దాని కోసం రాజమండ్రి వచ్చాడు.

1948–50 సంవత్సరాలలో వెల్లూరు, కడలూరు జైళ్లల్లో డిటెన్యూగా గడిపాడు. ఆ కాలంలో కడలూరు జైల్లో సుమారు 500 మంది డిటెన్యూలుగా వుండేవారు. జైల్లో కంభంపాటి సీనియర్, ఎ.కె. గోపాలన్, మోటూరి హనుమంతరావు, మద్దుకూరి చంద్రం తదితరులుండేవారు. జైల్లోనే తన సుప్రసిద్ధ గేయం "చెల్లి" రాశాడు.

చెల్లీ కన్నీరదేల/తల్లీ గద్గదమదేల?/నీ మధురప్రేమ పాత్రలో నీచులు విసమోసినార?/నీ హృది విపంచి తీగ నిలువున తెగగొట్టినార? అలాగే "ఎగరాలి ఎగరాలి / మన ఎర్రజెండా / అదురు బెదురూ లేక / అడ్డేదియును లేదు" అంటూ తొలిసారిగా తెలుగు కవిత్వంలో ఎర్రజెండా ఎగరేశాడు. యవ్వన తొలినాళ్లలోనే జి.వి. కృష్ణారావుతో కలసి "వేంకటకృష్ణ కవులు" పేరుతో అవధానాలు చేశారు. తెలుగునాట కమ్యూనిస్టు ఉద్యమంలో భాగంగా అభ్యుయ రచయితల సంఘం, పార్టీ పత్రికల ప్రచురణలోనూ తుమ్మల జీవితం పెనవేసుకుపోయింది. ఎక్కువ చదవటం–తక్కువ రాయటం ఆయన నైజం. 1943 తెనాలి ప్రథమ మహాసభ నుండి చివరి వరకు అరసం బాధ్యతలు మోశారు. సంస్థ నిర్మాణం మందగించినా దాన్ని మాయం కాకుండా నిలపగలిగాడు. 1946 పెదపూడి (గుంటూరు జిల్లా 1947 పల్లెకూన గుంటూరు జిల్లా) రాజకీయ పాఠశాల ద్వారా రచయితల్లో అభ్యుదయ అవగాహనకు కృషి చేశారు. అరసం రెండవ మహాసభ విజయవాడలో జరిగినప్పుడు తాను సౌజన్యారావు వేషం వేసి కంభంపాటి సీనియర్ రామప్పంతులుగా, డా॥.గరికపాటి రాజారావు గిరీశంగా, జోశ్యభట్ల దంపతులు అగ్నిహోత్రావధానుల దంపతులుగా, కొమర్రాజు పద్మ బుచ్చమ్మగా నటింపజేసి 'కన్యాశుల్కం' నాటకం ప్రదర్శించారు. తెనాలి ప్రథమ మహాసభలో సోవియట్ నాటిక 'ఇంగా'ని ప్రదర్శించారు. 1946 నుండి చనిపోయే వరకు మధ్యలో నాలుగేళ్లు (1978–82) తప్ప అభ్యుదయ సాహిత్య మాసపత్రికకు సంపాదక బాధ్యత వహించారు.

చిలకమర్తి స్వీయ చరిత్ర అరసం తరపున ప్రచురించటంతోపాటు ఆయన్ని విజయవాడ తీసుకొచ్చి రూ.1116 ఇచ్చి సత్కరించారు. గరిమెళ్ల ఆర్థికస్థితి బాగాలేదని తెల్సి ఆయనతో కొన్ని అనువాదాలు చేయించి కొంత ఆర్థిక సహాయం చేశారు. పార్టీ పత్రికలైన 'విశాలాంధ్ర, కొత్తబాట, నవశక్తి, ప్రజాశక్తి' బాధ్యతలు కూడా నిర్వహించారు. స్వంతంగా పత్రిక నడిపే ఆర్థిక వనరులులేని పరిస్థితిలో తెలుగుతల్లి పత్రిక వాళ్లతో మాట్లాడి అందులో అభ్యుదయ, వామపక్ష రచనలు వచ్చేట్లు చేశారు. అరసంని కమ్యూనిస్టు రచయితల సంఘంగా కాక అభ్యుదయాన్ని ఆశించే రచయితల సంఘంగా తీర్చిదిద్దాలని ఆయన ఆశ. కాని బయట ప్రపంచంలో కమ్యూనిస్టు రచయితల సంఘంగా దానిపై పడ్డ ముద్ర తొలగించలేకపోయామని ఆవేదన చెందారు. ఆయన రాసిన చెల్లి గీతాన్ని విశ్వనాథ లాంటి వారు మెచ్చుకున్నారు. ఆంధ్ర ప్రదేశ్ కమ్యూనిస్టు ఉద్యమచరిత్ర రాయటం ప్రారంభించి 1920 నుండి 1936 వరకు రాసి 1983 జనవరి 16న కంభంపాటి సీనియర్ చనిపోయారు. ఆ ప్రాజెక్టును కొనసాగించాలనే సంకల్పంతో తుమ్మల వెంకట్రామయ్య, వై.వి.కృష్ణారావు, పరకాల, ఏటుకూరితో ఒక సంపాదక వర్గాన్ని ఏర్పాటు చేసినా అందులో ఎక్కువ భాగం పని తుమ్మల గారే పూర్తి చేశారు. చనిపోయే ముందురోజు రెండవభాగం పని (1936–42 వరకు) పూర్తిచేసి ఆ మరుసటిరోజే 1987 నవంబర్ 7న కన్నుమూశారు. ఈ రెండు భాగాలూ పూర్తయిన దాకా కంభంపాటి సీనియర్, తుమ్మల సజీవులుగా వుండటం తెలుగు ప్రజల అదృష్టం.

(తుమ్మల జననం : 06-10-1914 మరణం : 07-11-1987)

చాట్‌జీపీటీపై సందేహాలు

చాట్ జీపీటీలో కచ్చితత్వం అసాధ్యం. ఇప్పుడు ప్రపంచం అంతా చాట్ జీపీటీ (చాట్ జనరేటివ్ ప్రీ-ట్రైన్డ్ ట్రాన్స్ ఫార్మర్)పైనే చర్చ జరుగుతోంది. దీనిపై భిన్నకథనాలు వినిపిస్తున్నాయి. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(కృత్రిమ మేధస్సు) ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతోంది. నేడు ఎంతోమంది చాట్ జీపీటీపైనే ఆధారపడుతున్నారు. ఏఐతో ఎన్నో అద్భుతాలు ఆవిష్కృతమవుతున్నాయి. ఈ చాట్‌బోట్ మనిషిచేసే చాలా పనులను చేస్తుంది. చాలా కంపెనీలు ఏఐతో పనులుచేస్తూ ఉద్యోగులను తొలగిస్తున్నాయి. ఇది అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని, దీని ఉపయోగం పెరిగేకొద్దీ అదేస్థాయిలో ఉద్యోగాలసంఖ్య తగ్గిపోతుందని అత్యధికమంది భయం వ్యక్తం చేస్తున్నారు. అయితే, చాట్ జీపీటీవల్ల ఆశించినంత ప్రయోజనంలేదని, ఈ ఓపెన్ ఏఐను స్థాపించిన సంస్థ (అమెరికన్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజన్స్ రీసెర్చ్ లేబరేటరీ) సంక్షోభంలో ఉందని, అది వచ్చే ఏడాదికి దివాళాతీస్తుందని మరికొందరు అంటున్నారు. ఈ రెండు వాదనలు సరైనవికావు. ఏఐ వల్ల కొంత ప్రయోజనం ఉన్నమాట నిజమే. అయితే, దాని వల్ల ఉద్యోగాలు భారీ స్థాయిలో కోల్పోయే మాట వాస్తవం కాదు. దీనివల్ల కొన్ని లాభాలు ఉన్నాయి. అలాగే, నష్టాలు కూడా ఉన్నాయి.

చాట్ జీపీటీ అంటే రెండు ముక్కల్లో తెలుసుకుందాం. ఇది గూగుల్‌కు ప్రత్యామ్నాయం, దానిని అభివృద్ధి పరిచినట్లుగా భావించవచ్చు. ఉదాహరణకు మనకు ఏదైనా ఒక అంశానికి సంబంధించిన సమాచారం కావాలంటే గూగుల్‌లో సెర్చ్‌చేస్తే, దానికి సంబంధించి వివిధ వెబ్‌సైట్లలో ఉండే సమాచారం చూపుతుంది. వాటిలో నుంచి మనకు కావలసిన సమాచారం తీసుకోవాలి. చాట్ జీపీటీలో అయితే, మనకు కావలసిన అంశానికి సంబంధించిన సమాచారం గుత్తగా ఒకేచోట లభిస్తుంది. ఉదాహరణకు హైదరాబాద్ లేక అమరావతి అని ఎంటర్‌చేస్తే, గూగుల్‌లో వాటికి సంబంధించిన చాలారకాల సమాచారం వస్తుంది. చాట్ జీపీటీలో అయితే, హైదరాబాద్ లేక అమరావతి సమాచారం ఒకేచోట లభిస్తుంది. ఆ సౌలభ్యం ఇందులోఉంది. ఇందులో అపారమైన సమాచారం ఉంటుంది. ఏ ప్రశ్న అడిగినా టెక్స్ట్ రూపంలో సమాధానం ఇస్తుంది. అయితే, ఇందులో ఈ సమాచారం మ్యాజిక్ ద్వారా ఏమీరాదు. దానిని ఉద్యోగులే సేకరించి, ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుంటారు. అయినా, ఆ సమాచారంలో చాలా లోపాలు ఉంటుంటాయి. ఆ లోపాలను ఉద్యోగులే సరిదిద్దాలి. అందువల్ల కొన్నిచోట్ల ఉద్యోగాలుపోతే, మరికొన్నిచోట్ల కొత్త ఉద్యోగాలు లభిస్తాయి. ఇందుకు సంబంధించి పరిశోధనా ఫలితాలను పరిశీలిద్దాం. అకౌంటింగ్ పరీక్షలో చాట్ జీపీటీ కంటే విద్యార్థులే మెరుగైన ప్రతిభ కనబరిచారు. విద్యార్థుల సరాసరి స్కోర్ 76.7 శాతం ఉండగా, చాట్ జీపీటీ స్కోర్ 47.4 శాతం మాత్రమే ఉంది. అమెరికాలో బ్రింగ్‌హ్యామ్ యంగ్ యూనివర్సిటీ(బీవైయూ)తోపాటు మరో 186 ఇతర యూనివర్సిటీలకు చెందిన పరిశోధకులు అకౌంటింగ్ పరీక్షల్లో చాట్‌జీపీటీ ఎలా పనిచేస్తుందో విస్తృతస్థాయిలో పరిశీలించారు. వారు తెలుసుకున్న విషయాలను అకౌంటింగ్ ఎడ్యుకేషన్ జర్నల్‌లో ప్రచురించారు. చాట్ జీపీటీ కంటే విద్యార్థులే తెలివైనవారని తేల్చారు. అయితే 11.3శాతం ప్రశ్నల విషయంలో చాట్ జీపీటీ స్కోర్ మెరుగ్గాఉందని తేలింది. అకౌంటింగ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్స్, ఆడిటింగ్‌లో ఫలితాలు మెరుగ్గా ఉన్నాయి. టాక్స్, ఫైనాన్షియల్, మేనేజరియల్ అసెస్‌మెంట్‌లో ఫలితాలు అధ్వాన్నంగా ఉన్నాయి. మేథమెటికల్ ప్రక్రియల్లో ఇబ్బందులు ఎదురైనట్లు గమనించారు.

చాట్ జీపీటీపై ఓ కేసు విషయంలో ఢిల్లీ హైకోర్టు చేసిన వ్యాఖ్యలను పరిశీలిద్దాం. మానవ మేధస్సును చాట్‌జీపీటీ ప్రభావితం చేయలేదని ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి ప్రతిభా ఎం సింగ్ వ్యాఖ్యానించారు. చాట్‌జీపీటీ ఆధారంగా కోర్టులు తీర్పులు చెప్పలేవన్నారు. తీర్పు ఇవ్వడానికి, వాస్తవాలు తేల్చడానికి చాట్‌జీపీటీని ప్రాతిపదికగా తీసుకోలేమని స్పష్టం చేశారు. ఇలాంటి చాట్‌బోట్‌ల కచ్చితత్వం, వాటిపై ఎంతవరకు ఆధారపడవచ్చునేది ఇంకా ప్రయోగాల దశలోనే ఉందన్నారు. అందువల్ల అవగాహనకోసం మాత్రం దీనిని ఉపయోగించుకోవచ్చని వివరించారు. చాట్ జీపీటీ డేటా ఊహాజనితమని,ఇందులో కచ్చితత్వం లేదని ఆయన అన్నారు.

చాట్ జీపీటీ వేదిక ఓపెన్ ఏఐ అతి త్వరలోనే ఆర్థిక సంక్షోభంలోకి జారుకోనుందని అనలిటిక్స్ ఇండియా సర్వే పేర్కొంది. 2024 చివరికి ఆ కంపెనీ దివాలా తీయవచ్చని అనలిటిక్స్ ఇండియా మేగజైన్ తన నివేదికలో వెల్లడించింది. ఈ ఓపెన్ ఏఐ సంస్థను సామ్ ఆల్ట్‌మన్ 2022 నవంబర్‌లో స్థాపించారు. జీపీటీ -3.5, జీపీటీ-4 వాడుకొనేందుకు డబ్బులు వసూలు చేస్తున్నప్పటికీ ఆ సంస్థ సరిపడా ఆదాయం సమకూర్చుకోలేకపోతోంది. ఇప్పట్లో లాభాలు రావడం కష్టమేనని

నిపుణులు అంటున్నారు. ఓపెన్ ఏఐని నడిపించేందుకు ప్రతి రోజూ 7 లక్షల డాలర్లు (రూ.5.8 కోట్లు) ఖర్చవుతోందని అంచనా. ఆ స్థాయిలో ఆదాయం మాత్రం రావడంలేదు. మొదట్లో దీనిని అత్యధికమంది ఉపయోగించేవారు. క్రమంగా వారి సంఖ్య తగ్గుతోంది. జూన్‌లో 170 కోట్లమంది చాట్ జీపీటీని ఉపయోగించుకోగా, జులై నాటికి వారి సంఖ్య 150 కోట్లకు తగ్గింది. అంటే 12శాతం పడిపోయింది. దాంతో సంస్థ నష్టాల్లో ఉంది. అయితే, 2023 చివరికి 200 మిలియన్ డాలర్ల ఆదాయం వస్తుందని ఓపెన్ ఏఐ అంచనావేస్తోంది. 2024 నాటికి బిలియన్ డాలర్ కంపెనీగా అవతరిస్తుందని పేర్కొంది. వినియోగదారుల సంఖ్యను పెంచుకునేందుకు ఓపెన్ ఏఐ సంస్థ తాజాగా చాట్ జీపీటీ-4 అప్‌డేట్ వెర్షన్‌ను తీసుకొచ్చింది. ఇది దాదాపు మనిషిలాగే పనిచేస్తుందని సంస్థ తెలిపింది. ఈ కొత్త వెర్షన్ మరింత సురక్షితంగా ఉంటుందని ఓపెన్ ఏఐ తన బ్లాగ్‌లో పేర్కొంది. క్లిష్టమైన ప్రశ్నలు, సమస్యలకు కూడా కచ్చితమైన సమాధానాలు ఇస్తుందని ఓపెన్ ఏఐ తెలిపింది. భవిష్యత్‌లో ఇమేజ్‌లరూపంలో ప్రశ్నలు అడిగినా సమాధానాలు చెప్పేలా చాట్ జీపీటీ 4ను రూపొందించారు. ఉదాహరణకు ఒక రిఫ్రిజిరేటర్(ఫ్రిడ్జ్) లోపలిభాగాన్ని ఫొటోతీసి జీపీటీ-4లో అప్‌లోడ్ చేస్తే, అందులో ఉన్న పదార్థాలతో ఏయే వంటలు చేయొచ్చు. ఎన్నిరకాల వంటలు, ఎలా చేయొచ్చో వివరిస్తుంది. ఆ వివరాలన్నిటినీ ఉద్యోగులే అప్‌లోడ్ చేస్తారు. అయితే, అన్ని సందర్భాలలో కచ్చితత్వం సాధ్యంకాదు. చివరకు ఉద్యోగులే దానికచ్చితత్వాన్ని పరిశీలించవలసి ఉంటుంది. అందువల్ల చాట్ జీపీటీ అభివృద్ధిచెందే క్రమంలో కొన్ని ఒడిదుడుకులు వచ్చినప్పటికీ ఆయాసంస్థలు ఉద్యోగాల సంఖ్యను భారీగా తగ్గించే అవకాశాలు చాలా తక్కువ ఉంటాయి. అయితే, ఈ చాట్ జీపీటీ సైబర్ దాడులకు ఉపయోపడే ప్రమాదంఉందని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

శిరందాసు నాగార్జున
సీనియర్ జర్నలిస్ట్ - 9440222914

సిక్కింలో వరద ఉధృతి

- 14కు చేరిన మృతులు, 110 మంది గల్లంతు
- ఉప్పొంగిన తీస్తా నది
- కొట్టుకుపోయిన వంతెనలు
- దెబ్బతిన్న వందలాది ఇళ్లు
- 4 జిల్లాలపై తీవ్ర ప్రభావం

గ్యాంగ్‌టక్: ఆకస్మిక వరదలు సిక్కిం ఉత్తరప్రాంతాన్ని అతలాకుతలం చేశాయి. ఎగువ నుంచి ఒక్కసారిగా వరద నీరు రావడంతో తీస్తా నది ఉప్పొంగి తీర ప్రాంతాలను ముంచెత్తింది. బుధవారం ఆకస్మిక వరదల్లో 14 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు గురువారం వెల్లడించారు. 110 మంది ఆచూకీ ఇంకా తెలియరాలేదు. గల్లంతైన వారిలో 22 మంది సైనిక సిబ్బంది కూడా ఉన్నారు. అప్రమత్తమైన అధికార యంత్రాంగం గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు చేపట్టింది. ఇప్పటివరకు 2 వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. బుధవారం సంభవించిన విపత్తు ప్రభావం సుమారు 22 వేల మందిపై పడిందని సిక్కిం రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ (ఎస్ఎస్‌డీఎంఏ) వెల్లడించింది. వరద కారణంగా రాష్ట్రంలోని పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. వరదల వల్ల తీస్తానది పై నిర్మించిన 11 వంతెనలు ధ్వంసమయ్యాయి. వాటిలో 8 బ్రిడ్జిలు వరద నీటిలో కొట్టుకుపోయాయి. ఆకస్మిక వరదల కారణంగా రాష్ట్రంలో 277 ఇళ్లు ధ్వంసమయ్యాయి. ఆకస్మిక వరదలు రాష్ట్రంలోని 4 జిల్లాలపై తీవ్ర ప్రభావం చూపాయి. రహదారులపై దాదాపు 10 అడుగుల మేర నీరు నిలిచింది. ఒక్కసారిగా మహోగ్రంగా తీస్తా నది వరద నీరు ముంచెత్తడంతో ప్రజలు సురక్షిత ప్రాంతాలకు వెళ్లే అవకాశం కూడా లభించలేదు. ఆర్మీకి చెందిన బీఆర్‌ఓ వరద నీటిలో చిక్కుకున్న వందలాది మంది ప్రజలను రక్షించింది. ఉత్తర సిక్కింలోని లోనాక్ సరస్సు ప్రాంతంలో మంగళవారం అర్ధరాత్రి దాటాక కుంభవృష్టి వర్షం కురవడంతో లాచెన్ లోయలోని తీస్తా నదికి భారీగా వరద వచ్చి చేరింది. నది ఉప్పొంగి ప్రవహించడంతో పరీవాహక ప్రాంతంలో అర్ధరాత్రి దాటిన తర్వాత 1:30 గంటల ప్రాంతంలో ఆకస్మిక వరదలు సంభవించాయి. మరోవైపు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 3,000 మంది పర్యాటకులు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో చిక్కుకుపోయినట్లు సిక్కిం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి వీబీ పాఠక్ తెలిపారు. చుంగ్‌థాంగ్‌లోని తీస్తా స్టేజ్ 111 ఆనకట్టలో పనిచేస్తున్న కొంతమంది కార్మికులు కూడా ఆనకట్ట సొరంగాల్లోనే చిక్కుకుపోయినట్లు పేర్కొన్నారు.

భారీ వర్షాల నేపథ్యంలో చుంగ్‌థాంగ్ డ్యామ్ నుంచి నీరు విడుదల చేయడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారిందని, తీస్తా నదిలో నీటి మట్టం ఒక్కసారిగా 15-20 అడుగుల మేర పెరిగిందని అధికారులు తెలిపారు. దీంతో అర్ధరాత్రి వరదలు ప్రారంభమయ్యాయని వెల్లడించారు. పరిస్థితి తీవ్రత నేపథ్యంలో ఈ ప్రకృతి వైపరీత్యాన్ని సిక్కిం ప్రభుత్వం విపత్తుగా ప్రకటించింది. వరదల తీవ్రతకు లాచెన్ లోయలోని ఆర్మీ పోస్టులు నీట మునిగాయి. సింగ్టమ్ ప్రాంతంలో ఆర్మీ వాహనాలు కొట్టుకుపోయాయి. అందులోని 22 మంది గల్లంతైనట్లు ఆర్మీ ఈస్టర్న్ కమాండ్ ఓ ప్రకటనలో వెల్లడించింది. వరదలు సంభవించిన ప్రాంతంలో ఇంటర్నెట్ సదుపాయం సరిగా లేకపోవడంతో అక్కడి ఆర్మీ సిబ్బందిని సంప్రదించడం కష్టంగా మారిందని సైనిక వర్గాలు తెలిపాయి. ఆకస్మిక వరదలతో తీస్తా నది తీరంలోలోని దిక్చు, సింగ్తమ్, రంగ్పో పట్టణాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. అనేక చోట్ల రహదారులు నీటమునిగాయి. పశ్చిమబెంగాల్, సిక్కింను కలిపే 10వ నంబర్ జాతీయ రహదారి చాలా చోట్ల దెబ్బతింది. మరోవైపు తీస్తా నది ప్రవహించే ఉత్తర బెంగాల్, బంగ్లాదేశ్‌లకు వరద హెచ్చరికలు జారీ చేయబడ్డాయి. మంగన్, గ్యాంగ్‌టక్, పాక్యోంగ్, నామ్చి జిల్లాల్లోని అన్ని పాఠశాలలు అక్టోబర్ 8 వరకు మూసివేస్తున్నట్లు విద్యా శాఖ నోటిఫికేషన్ తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం నాలుగు ప్రభావిత జిల్లాల్లో 26 సహాయ శిబిరాలను ఏర్పాటు చేసిందని ఎస్ఎస్‌డీఎంఏ తెలిపింది. గ్యాంగ్‌టక్ జిల్లాలోని ఎనిమిది సహాయ శిబిరాల్లో మొత్తం 1,025 మంది ఆశ్రయం పొందుతున్నారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: సీఎం ప్రేమ్‌సింగ్ తమాంగ్

ముఖ్యమంత్రి ప్రేమ్‌సింగ్ తమాంగ్ తీవ్రంగా ప్రభావితమైన ప్రాంతాలలో ఒకటైన సింగ్టామ్‌ను సందర్శించి పరిస్థితిని సమీక్షించారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సురక్షిత ప్రదేశాల్లో తలదాచుకోవాలని, వారి పునరావాసానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు ప్రభుత్వం చేస్తోందని హామీ ఇచ్చారు. ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన తర్వాత ఆయన తమాంగ్ సింగ్టామ్ కమ్యూనిటీ సెంటర్‌లో అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం, స్థానిక అధికారులు, సంస్థలు, వ్యక్తులు కలసికట్టుగా సహాయ చర్యల్లో భాగం పంచుకోవాలని విజ్ఞప్తి చేశారు.

సిసోడియాకు వ్యతిరేకంగా సాక్ష్యాలేవి?

దర్యాప్తు సంస్థలకు సుప్రీం ప్రశ్న

న్యూఢిల్లీ: మద్యం కుంభకోణం కేసులో ఆప్ నేత, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియాకు సంబంధించిన రెండు బెయిల్ పిటిషన్లపై సుప్రీంకోర్టు గురువారం విచారణ చేపట్టింది. విచారణ సందర్భంగా కేసు దర్యాప్తు చేస్తున్న కేంద్ర ఏజెన్సీలకు సర్వోన్నత న్యాయస్థానం కీలక ప్రశ్నలు సంధించింది. ఈ కేసులో సిసోడియాకు వ్యతిరేకంగా ఎలాంటి సాక్ష్యాలున్నాయని ప్రశ్నించింది. కొందరు వ్యక్తులకు లబ్ధిచేకూరేలా మద్యం విధానాన్ని రూపొందించారని సీబీఐ ఆరోపించింది. ఇందుకు సంబంధించి కొన్ని వాట్సాప్ సందేశాలను సాక్ష్యంగా సమర్పించింది. అయితే ఆ సందేశాల ఆమోదయోగ్యతపై సుప్రీంకోర్టు అభ్యంతరం వ్యక్తం చేసింది. 'వారు దాని గురించి (లంచాలపై విజయ్ నాయర్, మనీశ్ సిసోడియా చర్చలను ఉద్దేశిస్తూ) మాట్లాడుకోవడం మీరు చూశారా? ఈ సాక్ష్యాలు ఆమోదయోగ్యంగా ఉంటాయా? ఇది అప్రూవర్‌గా మారిన ఓ వ్యక్తి ఇచ్చిన వాంగ్మూలం కాదా? దీన్నెలా సాక్ష్యంగా భావించగలం' అని కోర్టు నిలదీసింది. సిసోదియాకు వ్యతిరేకంగా సరైన ఆధారాలు చూపించలేకపోయారని కోర్టు అభిప్రాయపడింది.

కేసులో నిందితుడిగా ఉన్న వ్యాపారవేత్త దినేశ్ అరోరా వాంగ్మూలం మినహా సిసోదియాకు వ్యతిరేకంగా ఇంకా ఏమి ఆధారాలున్నాయని సుప్రీం ధర్మాసనం దర్యాప్తు సంస్థలను ప్రశ్నించింది. 'మనీశ్ సిసోడియా డబ్బులు తీసుకున్నారని దర్యాప్తు సంస్థలు ఆరోపించాయి. ఆ డబ్బులు ఆయనకు ఎలా చేరాయి? రూ.100 కోట్లు, రూ.30 కోట్లు అని రెండు సంఖ్యలు చెప్పారు. వాటిని ఎవరు చెల్లించారు? డబ్బులిచ్చినట్లు ఆధారాలెక్కడ? దినేశ్ ఈ కేసులో నిందితుడే. అతడి వాంగ్మూలం కాకుండా ఇంకా ఏమైనా సాక్ష్యాలున్నాయా' అని ధర్మాసనం ప్రశ్నల వర్షం కురిపించింది.

కృతిమ మేధాతో రోడ్డు ప్రమాదాల నివారణ

న్యూఢిల్లీ: ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)తో కొత్త సాంకేతికతలు రోడ్డు ప్రమాదాలను తగ్గించడంలో సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. ఇంటర్నేషనల్ రోడ్ ఫెడరేషన్ (ఐఆర్ఎఫ్) ఇండియా చాప్టర్ నిర్వహించిన కార్యక్రమంలో స్టార్టప్ నేత్రాడైన్ సీనియర్ డైరెక్టర్ అమిత్ కుమార్ మాట్లాడుతూ... అధిక వేగం, బ్యాటరీల అదనపు బరువు కారణంగా రోడ్లపై సాంప్రదాయ కార్ల కంటే ఈ-వాహనాలు సురక్షితం కాదని అన్నారు. నేత్రాడైన్ అనేది డ్రైవర్ భద్రత కోసం ఏఐని ఉపయోగించే స్టార్టప్. 'ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ డ్రైవర్ ప్రవర్తనను పర్యవేక్షించడానికి, అలసట, పరధ్యానం లేదా బలహీనమైన డ్రైవింగ్ సంకేతాలను గుర్తించడంలో సహాయపడుతుంది. ప్రమాదాలను నివారించడానికి హెచ్చరికలను అందించడానికి లేదా వాహనాన్ని నియంత్రించడంలో సహాయపడుతుంది' అని కుమార్ తెలిపారు. ప్రమాదం తర్వాత తీసుకోవాల్సిన భద్రతా చర్యలు, మౌలికవసతుల పెంపుకు సంబంధించి డేటాను సేకరించడంలో కూడా ఏఐ ఉపయోగపడుతుందన్నారు. ఐఆర్ఎఫ్ అధ్యక్షుడు కేకే కపిల మాట్లాడుతూ... ఏఐ సహా కొత్త సాంకేతికతలు రోడ్డు ప్రమాదాల నివారణకు దోహద పడతాయన్నారు. ఆర్కాడిస్ ఐబీఐ డైరెక్టర్ వీఎస్ చుండూరు మాట్లాడుతూ... రోడ్డు రవాణా, ట్రాఫిక్ నిర్వహణ సహా అనేక సందర్భాల్లో రవాణా భద్రతను మెరుగు పర్చేందుకు సాంకేతికతలు ఉపయోగపడతాయన్నారు.

యోగి ప్రభుత్వానికి ఎదురుదెబ్బ

న్యూఢిల్లీ: ఉత్తరప్రదేశ్‌లో యోగి ఆదిత్యనాథ్ ప్రభుత్వానికి ఎదురుదెబ్బ తగిలింది. అమేథీలో సంజయ్‌గాంధీ ఆసుపత్రి లైసెన్సును నిలిపివేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఉత్తర్వులపై అలహాబాద్ హైకోర్టు స్టే ఇవ్వడాన్ని బీజేపీ ఎంపీ వరుణ్‌గాంధీ గురువారం స్వాగతించారు. ఆసుపత్రి కోసం పోరాడి...విజయం సాధించిన జిల్లా ప్రజలు, సిబ్బందికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. 22 ఏళ్ల యువతి సర్జరీ తర్వాత చనిపోవడంతో ఆసుపత్రి లైసెన్సును యూపీ ప్రభుత్వం నిలిపివేస్తూ ఆదేశాలిచ్చింది. ఈ ఉత్తర్వులపై హైకోర్టు బుధవారం స్టే ఇచ్చింది. 'సంజయ్‌గాంధీ ఆసుపత్రి లైసెన్సు నిలిపివేతపై హైకోర్టు స్టే ఇచ్చింది. ఆసుపత్రి కోసం పోరాడిన అమేథీ జిల్లా ప్రజలకు, ఆసుపత్రి ఉద్యోగులకు ధన్యావాదాలు తెలుపుతున్నాను. సంజయ్‌గాంధీ ఆసుపత్రి ఏళ్ల తరబడి ప్రజలకు విశేష సేవలందిస్తుంది' అని వరుణ్‌గాంధీ ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. ప్రభుత్వ ఉత్తర్వులను ప్రశ్నిస్తూ ఆసుపత్రి చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌పై హైకోర్టు స్టే ఉత్తర్వులు ఇచ్చింది.

ఆర్థిక కష్టాలు మోదీ సృష్టించినవే: కాంగ్రెస్

న్యూఢిల్లీ: చాలా వరకు భారతీయులు ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నట్లు కాంగ్రెస్ పేర్కొంది. ప్రధాని మోదీ విధానాలే ఇందుకు కారణమని విమర్శించింది. భారతీయ కుటుంబాల్లో అత్యధిక శాతం ఆర్థిక కష్టాల్లో ఉన్నట్లు భారత రిజర్వు బ్యాంకు (ఆర్బీఐ) డేటా చెబుతోందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎక్స్ మాధ్యమంగా తెలిపారు. మోదీ ప్రభుత్వ విధానాల వల్లే అధిక శాతం కుటుంబాలు ఆర్థికంగా దెబ్బతిన్నట్లు వెల్లడించారు. ఆర్బీఐ తాజా డేటా ఆధారంగా కుటుంబాల్లో పొదుపు స్థాయి చారిత్రక కనిష్ఠానికి పడిపోగా, రుణాలు పెరిగాయన్నారు. నాలుగేళ్ల సవరిత ద్రవ్యోల్బణానికి ఆదాయ వృద్ధి 40ఏళ్ల కనిష్ఠ స్థాయికి చేరినట్లు జైరాం రమేశ్ ట్వీట్ చేశారు. 2023 ఆర్థిక సంవత్సరంలో కుటుంబాల్లో పొదుపుశాతంలో ఐదో వంతుకు తగ్గినట్లు తెలిపారు. వినియోగ వ్యయ సర్వే 2022-23 వివరాలను కప్పిపుచ్చే ప్రయత్నాన్ని మోదీ ప్రభుత్వం చేస్తోందని, ఇలా చేయడం ద్వారా అందుకు జవాబుదారీ నుంచి తప్పించుకోలేరని అన్నారు. చాలా మంది భారతీయులు ఎలా పేదలవుతున్నారో కూడా ఇది బయట పెడుతుందని చెప్పారు. ద్రవ్యోల్బణం, రుణాలు పెరగడం, కుటుంబాల వినియోగం మందగించడం, పొదుపులో క్షీణత వంటివన్నీ మోదీ సృష్టిత ఆర్థిక కష్టాల పర్యవసానాలని జైరాం రమేశ్ దుయ్యబట్టారు.

'సెన్సార్' అవినీతి కేసులో సీబీఐ ఎఫ్ఐఆర్ దాఖలు

న్యూఢిల్లీ: సినిమా సెన్సార్ కోసం లంచం తీసుకున్నట్లు సెన్సార్ బోర్డు (సీబీఎఫ్‌సీ)పై వచ్చిన ఆరోపణల ఆధారంగా ముగ్గురు వ్యక్తులు, గుర్తుతెలియని అధికారులపై ఎఫ్ఐఆర్‌ను సీబీఐ గురువారం దాఖలు చేసింది. మెర్లిన్ మనేగా, జీజా రామ్‌దాస్, రంజన్ ఎంతో పాటు సీబీఎఫ్‌సీకి చెందిన గుర్తుతెలియని కొందరు అధికారులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు దర్యాప్తు సంస్థ అధికారులు వెల్లడించారు. ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్న వ్యక్తుల ఇళ్లు, ముంబైలోని నాలుగు ప్రాంతాల్లో బుధవారం సోదాలు జరిగాయి. తన సినిమా 'మార్క్ ఆంటోని' హిందీలో విడుదలకు సెన్సార్ కోసం రూ.6.5లక్షల లంచం ఇచ్చినట్లు ప్రముఖ నటుడు విశాల్ ఆరోపించారు. 'మార్క్ ఆంటోని' హిందీ వెర్షన్ సెన్సార్ పనులకు రూ.6.5 లక్షలు (స్క్రీనింగ్ కోసం రూ.3.5 లక్షలు, సర్టిఫికెట్ కోసం రూ.3 లక్షలు) ఇచ్చినట్లు తెలిపారు. ఇలాంటి పరిస్థితి తనకు ఎన్నడూ ఎదురు కాలేదని, మరో దారి లేక డబ్బులివ్వాల్సి వచ్చినట్లు తెలిపారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు ఉంటాయని, న్యాయం జరుగుతుందని ఆకాంక్షించారు. సెన్సార్ బోర్డులో లంచం వ్యవహారాన్ని ప్రధాని మోదీ, మహారాష్ట్ర సీఎం షిండే దృష్టికీ విశాల్ తీసుకెళ్లారు. ఎవరెవరికి డబ్బు ఇచ్చింది వారి పేర్లు, బ్యాంకు ఖాతాల వివరాలను ఎక్స్ మాధ్యమంగా వెల్లడించారు.

ఈ వ్యవహారంలో కేంద్ర ప్రసారాలు, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ దర్యాప్తునకు తక్షణమే ఆదేశాలివ్వగా తాజా ఎఫ్ఐఆర్‌ను సీబీఐ దాఖలు చేసింది. హిందీలో డబ్ చేసిన సినిమాకు సీబీఎఫ్‌సీ, ముంబై సెన్సార్ సర్టిఫికేట్ కోసం రూ.7లక్షల లంచం తీసుకోవాలని కొందరితో కలిసి ఓ ప్రైవేటు వ్యక్తి సెప్టెంబరులో వ్యూహరచన చేసినట్లు సీబీఐ అధికార ప్రతినిధి తెలిపారు. మెర్లిన్ మనేగా మధ్యవర్తి అని, తొలుత సీబీఎఫ్‌సీ-ముంబై అధికారుల తరపున లంచం డిమాండ్ చేశారని, బేరసారాల తర్వాత రూ.6.54లక్షలుకు ఒప్పందం జరిగిందని ఎఫ్ఐఆర్ పేర్కొంది. కాగా నిందితుల్లో ఇద్దరి వ్యక్తుల బ్యాంకుల ఖాతాల్లో లంచం డబ్బు జమ కాగా మనేగా ఖాతాలో రూ.20వేలు ప్రైవేటు కంపెనీ ద్వారా కోఆర్డినేటిక్ ఫీగా జమైనట్లు సీబీఐ అధికారి వెల్లడించారు.

ఐఏఎఫ్‌కు తొలి తేజస్ రెండు సీట్ల విమానం

బెంగళూరు: దేశీయ పరిజ్ఞానంతో తయారైన తేలికపాటి యుద్ధ విమానం 'తేజస్ ట్విన్ సీటర్' భారత వాయుసేన (ఐఏఎఫ్)కు చేరింది. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) దీనిని వాయుసేనకు అందజేసింది. కర్నాటక రాజధాని బెంగళూరులోని హెచ్ఏఎల్ ప్రధాన కార్యాలయంలో రక్షణ శాఖ సహాయ మంత్రి అజయ్ భట్, ఎయిర్ చీఫ్ మార్షల్ వీర్ చౌధరి అధ్వర్యంలో రెండు సీట్లు ఉండే తేజస్ తొలి విమానం ఐఏఎఫ్‌కు అందజేసే కార్యక్రమం జరిగింది. పూర్తిస్థాయి యుద్ధ విమానంగా దీనిని తయారు చేశారు. అత్యవసర సమయంలో పనిచేసే సామర్థ్యం తేజస్ ట్విన్ సీటర్‌కు ఉందని హెచ్ఏఎల్ తెలిపింది. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో రూపుదిద్దుకున్న ఈ విమానాలు భారత ఏరోస్పేస్ సామర్థ్యానికి ప్రతీకని పేర్కొంది. వీటిలో స్టాటిక్ స్టేబిలిటీ, క్వాడ్రాప్లెక్స్ ఫ్లై-బై-వైర్ ఫ్లైట్ కంట్రోల్, కేర్‌ఫ్రీ మేనొవరింగ్, ఆధునిక గ్లాస్ కాక్‌పిట్, ఇంటిగ్రేటెడ్ డిజిటల్ ఏవియోనిక్స్ సిస్టమ్స్, అత్యాధునిక ఎయిర్‌ఫ్రేమ్ వంటి ఫీచర్లు ఉన్నట్లు తెలిపింది. ఇలాంటి యుద్ధ విమానాలు కొన్ని దేశాలు వద్ద మాత్రమే ఉన్నాయని పేర్కొంది. తేజస్ రాకతో ఆ కొద్ది దేశాల సరసన భారత్ నిలిచిందని వెల్లడించింది. వర్తమాన పైలట్లను ట్విన్ సీటర్ పైలట్ల నుంచి పూర్తిస్థాయి ఫైటర్ పైలట్లుగా మార్చాలనే వ్యూహాత్మక లక్ష్యంతో వీటిని డిజైన్ చేసినట్లు తెలిపింది. మొత్తం 18 ట్విన్ సీటర్ తేజస్ యుద్ధ విమానాలను వాయుసేన కోసం హెచ్ఏఎల్ తయారు చేయనుంది. తొలి విడతగా 2023-24లో ఎనిమిది విమానాలు, 2026-27లో మిగిలిన రెండు విమానాలను వాయుసేనకు అందిస్తుంది.

ఆప్ ఎంపీ అరెస్టుపై ఆగ్రహజ్వాల

- బీజేపీ కార్యాలయం ముట్టడికి యత్నం
- ఆందోళనకారులపై జల ఫిరంగులు, బాష్పవాయువు ప్రయోగం

చండీగఢ్: ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్ అరెస్టుపై నిరసనాగ్రహం వెల్లువెత్తింది. చండీగఢ్‌లోని బీజేపీ కార్యాలయం ముట్టడికి ప్రయత్నించిన ఆప్ నాయకులు, కార్యకర్తలపై పోలీసులు గురువారం జల ఫిరంగులు, బాష్పవాయువు గోళాలు ప్రయోగించారు. ఆప్ కార్యకర్తలు బారికేడ్లను సైతం తొక్కుకుంటూ ముందుకు దూసుకుపోవడానికి యత్నించారు. సంజయ్‌సింగ్ అరెస్టును నిరసిస్తూ దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించిన ఆప్ కార్యకర్తలపై లాఠీలు ఝుళిపించారు. బలప్రయోగంతో కార్యకర్తలను చెల్లాచెదురు చేశారు. ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో మనీలాండరింగ్‌కు సంబంధించి ఆప్ రాజ్యసభ సభ్యుడు సంజయ్‌సింగ్ నివాసంలో ఈడీ బుధవారం తనిఖీలు చేసింది. పంజాబ్ బీజేపీ కార్యాలయానికి ఆప్ నాయకులు, కార్యకర్తలు వెళ్లకుండా అడ్డుకోవడానికి భారీగా బారికేడ్లు ఏర్పాటు చేశారు. ఆందోళనకారుల్లో పెద్దఎత్తున పార్టీ సీనియర్ నాయకులు సైతం పాల్గొన్నారు. అంతకుముందు రాష్ట్ర ఆర్థికశాఖమంత్రి హర్పాల్‌సింగ్ చీమా విలేకరులతో మాట్లాడుతూ సంజయ్‌సింగ్ అరెస్టుపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని నిందించారు. దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేయడం ద్వారా ప్రతిపక్షాల గొంతు నొక్కడానికి కేంద్రం ప్రయత్నిస్తోందని విమర్శించారు. కాగా, ప్రతిపక్ష నాయకులను బెదిరించడానికి ఈడీని ప్రయోగించడం ప్రధాని నరేంద్రమోదీ సహజ లక్షణమని పంజాబ్ ముఖ్యమంత్రి భగవంత్ మాన్ బుధవారం ఆరోపించారు. సంజయ్‌సింగ్ అరెస్టు చట్టవిరుద్ధమని ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ విమర్శించారు. పార్లమెంటు ఎన్నికలు సమీపిస్తున్న వేళ రానున్న రోజుల్లో ప్రతిపక్ష నేతల అరెస్టులు ఇంకా కొనసాగుతాయని ఆయన చెప్పారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓటమి భయంతోనే సింగ్ నివాసంపై మోదీ ఈడీని పంపారని ఆరోపించారు.

సంజయ్ సింగ్ అరెస్టుపై ఆప్ నిరసన

న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ఎంపీ సంజయ్ సింగ్‌ను అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ ఆప్ కార్యకర్తలు గురువారం సెంట్రల్ ఢిల్లీలో నిరసన చేపట్టారు. డీడీయూ మార్గ్‌లోని ఆప్ పార్టీ కార్యాలయం వద్ద ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు సమావేశమై బ్యానర్లు పట్టుకుని బీజేపీకి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ సంజయ్ సింగ్‌ను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆందోళనకారులను అదుపు చేసేందుకు తగినంతమంది భద్రతా సిబ్బందిని ఏర్పాటు చేశామని స్పెషల్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (లా అండ్ ఆర్డర్) దేవేంద్ర పాఠక్ తెలిపారు. 'మేము సరైన ఏర్పాట్లు చేశాము. తగినంత మంది పోలీసులు ఉన్నారు. శాంతిభద్రతలు క్షీణించడం మాకు ఇష్టం లేదు. మేము ఆప్ కేడర్‌తో నిరంతరం కమ్యూనికేట్ చేస్తున్నాము'అని ఆయన చెప్పారు. నిరసన కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ నేతలు అతిషి, గోపాల్ రాయ్, జర్నైల్ సింగ్, ప్రియాంక కక్కర్, రీనా గుప్తా తదితరులు పాల్గొన్నారు. వచ్చే ఎన్నికల్లో గెలవాలని బీజేపీ చేస్తున్న ప్రయత్నమే సింగ్ అరెస్ట్ అని రాయ్ ఆరోపించారు. 'బీజేపీ దేశవ్యాప్తంగా సర్వే చేయించింది. అది ఓడిపోతుందని తెలుసు. ఎన్డీయేపై విశ్వాసం లేదు, అందుకే ఈడీ ద్వారా అరెస్టులు చేసి ఎన్నికల్లో గెలవాలని చూస్తున్నారు' అని నిరసనలో పాల్గొన్న ఢిల్లీ మంత్రి గోపాల్ రాయ్ పేర్కొన్నారు. అదానీ గ్రూపునకు సంబంధించిన అంశాలను పార్లమెంట్‌లో లేవనెత్తినందుకే సింగ్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ అరెస్టు చేసిందని ఆప్ దుయ్యబట్టింది.

గవర్నరుది జమిందారీ సంస్కృతి

తృణమూల్ కాంగ్రెస్ విమర్శ



కోల్‌కతా: రాష్ట్రానికి రావాల్సిన కేంద్రం నిధుల విడుదల కోసం డిమాండ్ చేస్తూ రాజ్‌భవన్ మార్చ్‌కు పిలుపునిచ్చిన రోజే గవర్నరు సీవీ ఆనంద్‌బోస్ ఉత్తర బెంగాల్ పర్యటనకు వెళ్లడంపై తృణమూల్ కాంగ్రెస్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేసింది. ఉత్తర బెంగాల్ వచ్చి తనను కలవాలంటూ గవర్నరు చెప్పడంపై ఆగ్రహం వెలిబుచ్చింది. గవర్నరు తీరు జమిందారీ సంస్కృతిని తలపిస్తున్నదని విమర్శించింది. ఉత్తర బెంగాల్ జిల్లాల్లో వరద పరిస్థితిని అంచనా వేసిన అనంతరం గవర్నరు న్యూఢిల్లీ వెళతారని ఓ అధికారి చెప్పారు. అపాయింట్‌మెంటు ఇవ్వాలని కోరుతూ మంగళవారం తృణమూల్ కాంగ్రెస్ పార్టీ లేఖ రాసిందని, అయితే తాను అందుబాటులో ఉండటం లేదని గవర్నరు సమాధానమిచ్చారని, దీనికి బదులుగా పర్యటన నుంచి తిరిగి వచ్చిన తర్వాత సమావేశం కావడానికి అవకాశం ఇవ్వాలని రాజ్యసభలో తృణమూల్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత డెరెక్ ఒబ్రెయిన్ కోరారని పార్టీ తెలిపింది. దీనికి గవర్నరు సమాధానమిస్తూ ప్రతినిధి బృందం ఉత్తర బెంగాల్ వచ్చి కలవాలని చెప్పారని, గవర్నరు తీరు బాధ్యతారాహిత్యమని విమర్శించింది.

తాము పోరాటం చేస్తున్న జమిందారీ సంస్కృతిని రాష్ట్రంపై రుద్దాలని గవర్నరు ప్రయత్నిస్తున్నట్లు మండిపడింది. తమ బృందంతో సమావేశం ఆవశ్యకతను గవర్నరు గుర్తించకపోవడం దురదృష్టకరమని, ఉపాధి హామీ కార్డుదారుల సమస్యల గురించి గవర్నరుతో మాట్లాడటానికి తాము ప్రయత్నించామని తృణమూల్ కాంగ్రెస్ అధికార ప్రతినిధి కునాల్ ఘోష్ తెలిపారు. గవర్నరు కేంద్ర ప్రతినిధిగా బీజేపీ మాదిరిగానే వ్యవహరించారని ఆరోపించారు.

అమలు చేయకపోతే చట్టమెందుకు?

మహిళా చట్టంపై ప్రియాంక ప్రశ్న

ధార్(ఎంపీ): మహిళా రిజర్వేషన్ల చట్టాన్ని తక్షణమే అమలు చేయకపోతే...ఆ చట్టం తీసుకురావడం వల్ల ప్రయోజనం ఏమిటని మోదీ ప్రభుత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ వాద్రా గురువారం సూటిగా ప్రశ్నించారు. మహిళలను జోకర్లుగా కేంద్రం భావిస్తోందని మండిపడ్డారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ఇటీవలే చట్టం వచ్చిందని, దీనిని పదేళ్ల వరకూ అమలు చేయబోమని మోదీ సర్కారు చెప్పడం దుర్మార్గమని విమర్శించింది. ధార్ జిల్లా మోహన్‌ఖెదాలో జరిగిన ఎన్నికల ర్యాలీలో ప్రియాంకగాంధీ వాద్రా ప్రసంగిస్తూ తక్షణమే అమలు చేయనప్పుడు మహిళా బిల్లును ఇప్పుడే హడావుడిగా ఎందుకు తీసుకొచ్చారని నిలదీశారు. 'మోదీ ప్రభుత్వం మహిళా రిజర్వేషన్ బిల్లు తీసుకొచ్చింది. దానికి ప్రతిపక్షాలన్నీ మద్దతిచ్చాయి.

అయితే, పదేళ్ల వరకూ ఇది అమలు కాదని బీజేపీ చెబుతోంది. దీని అమలుకు ముందు జనగణన చేయాలని మెలిక పెడుతోంది. ఈ ప్రకటన వెనుక ఉద్దేశం ఏమిటి? మహిళలను మీరు జోకర్లుగా భావిస్తున్నారా' అని ప్రియాంకగాంధీ ప్రశ్నించారు. మహిళా రిజర్వేషన్ల చట్టం అమలు చేయడానికి ముందు నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ ప్రారంభం కావాలని ప్రభుత్వం చెబుతోందని, ఇది జరగడానికి పదేళ్ల సమయం పడుతుందని ఆమె తెలిపారు. 'అందరికీ సమాన హక్కులు ఉంటే...కులగణన ఎందుకు చేపట్టడం లేదు? బీహారులో కులగణన చేశారు. మొత్తం జనాభాలో 84శాతం మంది ఓబీసీలు, దళితులు ఉన్నారు. కానీ వారికి ప్రభుత్వ ఉద్యోగాలు ఆ నిష్పత్తిలో రావడం లేదు. అయినా బీజేపీ ఎందుకు మౌనం వహిస్తుంది' అని ఆమె నిలదీశారు.

విరాళాల కట్టుకథతో వైసీపీ అభాసుపాలు

ఎలక్టోరల్ బాండ్లతో వచ్చిన రూ.330.44 కోట్ల సంగతేమిటి: అచ్చెన్నాయుడు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్‌కి సంబంధించి రూ.27 కోట్ల నిధులు తెలుగుదేశం పార్టీ ఖాతాకు మళ్లించారంటూ పార్టీకి వచ్చిన విరాళాలపై వైసీపీ నేతలు కట్టుకథ అల్లి చివరకు అభాసుపాలయ్యారని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు కె.అచ్చెన్నాయుడు గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. రూ.20 వేలకు మించి వచ్చే విరాళం వివరాలన్నింటినీ కేంద్ర ఎన్నికల సంఘానికి, ఆదాయపు పన్ను శాఖకు రాజకీయ పార్టీలు తెలియజేయాలి. ఆ వివరాలు ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంటాయి. ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి టీడీపీ నిధుల వివరాలను సీఐడీ అధికారికంగా ఏప్రిల్‌లో డౌన్‌లోడ్ చేసింది. ఎవరు ఏ రోజు ఎంత విరాళాలిచ్చారో అందులో స్పష్టంగా ఉంది. ఆరు నెలల సీఐడీ పరిశీలన అనంతరం అవకతవకలు లేకున్నా బురద జల్లడమే లక్ష్యంగా పెద్దఎత్తున నిధులు వచ్చాయని చెప్పడం, అక్రమ కేసులకు ముడిపెట్టడం... ప్రభుత్వ పెద్దల ఆదేశాలకు తలొగ్గి దర్యాప్తు సంస్థలు చట్టవ్యతిరేకంగా పని చేస్తున్నాయని చెప్పడానికి ప్రత్యక్ష సాక్ష్యమని అచ్చెన్నాయుడు అన్నారు. 2018-19లో టీడీపీ ఖాతాకు రూ.27 కోట్లు ఎన్నికల బాండ్ల రూపంలో వచ్చాయని చెబుతున్నారు. అదే సంవత్సరంలో అవే బాండ్ల రూపంలో వైసీపీ ఖాతాకు రూ.99.84 కోట్లు, 2019-20లో రూ.74.35 కోట్లు, 2020-21లో రూ.96.25 కోట్లు, 2021-22లో రూ.60 కోట్లు వచ్చాయి. ఈ విరాళాలిచ్చిన వ్యక్తులు, సంస్థల పేర్లు సాక్షి పేపర్లో ప్రచురించే దమ్ము జగన్‌కు ఉందా? అని ప్రశ్నించారు. 'ఆరు నెలల క్రితం ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ నుంచి సేకరించినట్లు నీ పంచనామా నివేదిక చెబుతోంది. ఇప్పుడు కోర్టు ముందు పెద్ద మొత్తంలో నగదు వచ్చిందని అసంబద్ధ ఆరోపణలు చేస్తున్నారు. ఆరు నెలల్లో ఏం ఆధారాలు కనిపెట్టారో కోర్టుకు ఎందుకు సమర్పించలేకపోతున్నారు. చంద్రబాబుకు బెయిల్ రాకుండా ఆయన ప్రాథమిక హక్కుల్ని కాలరాసేందుకు దర్యాప్తు సంస్థలు కుట్ర చేస్తున్నాయని మండిపడ్డారు. రాజకీయ పార్టీలు ఎలక్టోరల్ బాండ్స్ సేకరించుకునేందుకు కేంద్ర ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తూ చట్టం చేసింది. కానీ జగన్ వాటిని తప్పుబడుతూ, అదో కుంభకోణం అన్నట్లుగా మాట్లాడుతూ కేంద్ర చట్టాలను అపహాస్యం చేస్తున్నాడు. చంద్రబాబును అక్రమంగా నిర్బంధించి ఉంచడానికి కుట్ర చేస్తున్నారని ఈ వ్యాఖ్యలతో అర్థమవుతోంది. న్యాయ వ్యవస్థను సైతం తప్పుదోవ పట్టించేలా వ్యవహరించడం ద్వారా ప్రజాహక్కుల్ని, రాజ్యాంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్నారు' అని అచ్చెన్నాయుడు విమర్శించారు.

కార్పొరేట్ల లబ్ధి మోదీ లక్ష్యం

- స్టీల్‌ప్లాంట్ రుణాలు మాఫీ చేయలేరా?
- ఉక్కు పరిరక్షణకు 'ఇండియా' అండ
- విశాఖ సభలో సీతారాం ఏచూరి

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం/కూర్మన్నపాలెం: దేశ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టడమే ప్రధాని నరేంద్రమోదీ లక్ష్యమని, దేశం కన్నా పెట్టుబడిదారుల లాభం కోసమే పనిచేస్తున్న మోదీ సర్కార్‌ను గద్దె దించాలని సీపీఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. 966 రోజులుగా చేస్తున్న ఉక్కు పోరాటానికి ప్రతిపక్ష 'ఇండియా' కూటమి మద్దతిస్తూ దిల్లీలో ఉక్కు పరిరక్షణ కోసం ఉద్యమిస్తామని సీతారాం ఏచూరి హామీ ఇచ్చారు. ఉక్కు పరిరక్షణ కోసం జరిగిన బైక్ యాత్ర ముగింపు సభ ఉక్కునగరం స్టీల్‌ప్లాంట్ రహదారిపై గురువారం సాయంత్రం జరిగింది. సీతారాం ఏచూరి మాట్లాడుతూ విశాఖలోని ప్రభుత్వరంగ సంస్థల విక్రయానికి ఎప్పటినుంచో కుట్ర జరుగుతోందని విమర్శించారు. నష్టాల పేరుతో బీహెచ్‌పీవీని గతంలో అమ్మాలని చూస్తే దాన్ని బెల్‌లో విలీనం చేసి లాభాలు తెప్పించామన్నారు. హిందుస్థాన్ షిప్‌యార్డ్ ప్రైవేటీకరణకు ప్రయత్నించారని గుర్తుచేశారు. తూర్పుతీరంలో ఉన్న విశాఖపట్నం పోర్టుకు శాటిలైట్ పోర్టుగా ఉండాల్సిన గంగవరం పోర్టును ప్రైవేటు కరించారని మండిపడ్డారు. ప్రభుత్వ రంగ సంస్థల ద్వారా వచ్చే లాభాల కన్నా పెట్టుబడుదారుల ప్రయోజనమే లక్ష్యంగా మోదీ సర్కార్ పనిచేస్తున్నదన్నారు. అందులో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ ప్రైవేటు పెట్టుబడిదారులకు అమ్మేస్తోందని ఏచూరి విమర్శించారు. రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇవ్వాలని రాజ్యసభలో ప్రశ్నిస్తే నాటి కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు ఐదేళ్ల ప్రత్యేక ప్యాకేజీ ఇస్తామని హామీ ఇచ్చారని ఏచూరి గుర్తుచేశారు. విభజన హామీలైన పోలవరం, విశాఖ రైల్వే జోన్, కడప ఉక్కు పరిశ్రమను పట్టించుకోని మోదీ సర్కారు... విశాఖ ఉక్కును ప్రైవేటీకరించాలని చూస్తోందన్నారు. కార్పొరేట్ పెట్టుబడుదారులకు సంబంధించిన రూ.16 లక్షల కోట్ల రుణాలను మాఫీ చేసిన మోదీ సర్కారుకు... స్టీల్‌ప్లాంట్ రుణాలు మాఫీ చేసే మనస్సు లేదా అని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని, 10 మిలియన్ టన్నుల ఐరన్ ఓర్ కేటాయిస్తే విశాఖ ఉక్కు లాభాలబాట పడుతుందన్నారు. దేశంలో నిరుద్యోగం పెరిగిపోయిందని, ధరల నియంత్రణ లేక సామాన్యుల జీవనం చితికిపోయిందన్నారు. జీ-20 సదస్సు ప్రచారానికి రూ.4,100 కోట్లు వెచ్చించిన కేంద్రం...ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి నిధులు ఇవ్వడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దేశంలో మత ఘర్షణలు అధికమయ్యాయన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మోదీ సర్కారును గద్దె దించడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని రక్షించుకోవాలని, దేశ సంపదను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. 28 విపక్ష రాజకీయ పార్టీలు ఏకమై, ఇండియా కూటమిగా ఏర్పడి దేశ రక్షణ కోసం పనిచేస్తున్నాయన్నారు..

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉక్కును అమ్మేస్తాం, చంపేస్తామంటే మోదీ అంతు చూస్తామని కార్మికవర్గం హెచ్చరిస్తున్నదన్నారు. 9 ఏళ్ల మోదీ పాలనలో ఏపీకి తీవ్ర నష్టం జరిగిందని, స్టీల్‌ప్లాంట్ ఆస్తులను పోస్కో, అదానీ, అంబానీ, జిందాల్ చేతుల్లో పెడితే ఊరుకునేది లేదన్నారు. ముఖ్యమంత్రి జగన్ విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణపై దిల్లీలో ఎందుకు నోరు విప్పడం లేదని ప్రశ్నించారు. స్టీల్‌ప్లాంట్‌ను పరిరక్షించకుండా విశాఖలో కాపురం ఉంటే ప్రయోజనం ఏమిటని నిలదీశారు. జనసేన నేత పవన్ కల్యాణ్ ఓ చెయ్యి బీజేపీకి, మరో చేయి టీడీపీకి ఇచ్చారని, వారిని వదిలితే ప్రజలే పవన్ చేతులు పట్టుకుంటారని చెప్పారు. సభకు సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు అధ్యక్షత వహించగా సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీహెచ్ నర్సింగరావు, కె.లోకనాథం, కిలో సురేంద్ర, ఉత్తరాంధ్ర జిల్లాల సీపీఎం కార్యదర్శులు టి.సూర్యనారాయణ, ఆర్.గోవిందరావు, రెడ్డి వేణు, 78వ వార్డు కార్పొరేటర్ బి.గంగారావు, ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు కేఎస్ఎన్ రావు, నీరుకొండ రామచంద్రరావు, కె.అయోధ్యరాం తదితరులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో మరణాలపై
సీపీఐ ఆందోళన

న్యూదిల్లీ: మహారాష్ట్రలోని ఔరంగాబాద్, నాందేడ్ ప్రభుత్వ ఆసుపత్రుల్లో వరుస మరణాలపై సీపీఐ తీవ్రంగా స్పందించింది. సీపీఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారం విడుదల చేసిన ప్రకటనలో... ఈ మరణాలపై విచారం వ్యక్తం చేసింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సరిగా స్పందించలేదని, దీంతో ఈ మరణాలు పౌర సమాజాన్ని ఆందోళన కలిగిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్రం, మహారాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యానికి ఈ ఘటనలే నిదర్శనమని, ఆరోగ్య సేవలు అధ్వానంగా ఉన్నాయని సీపీఐ విమర్శించింది. ప్రభుత్వం ఆరోగ్య సేవలపై మరింతగా నిధులు వెచ్చించాలని, సేవల్లో నాణ్యత పెంచాలని డిమాండ్ చేసింది. మృతి చెందిన రోగుల కుటుంబాలకు సీపీఐ సంతాపం తెలిపింది. బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేసింది. ఈ మరణాలకు కారకులైన వారిపై కఠినంగా చర్యలు చేపట్టాలని కోరింది. మందుల పంపిణీ, కొనుగోళ్ల వ్యవస్థను క్రమబద్ధీకరించాలని, తమిళనాడు ప్రభుత్వం విధానాలను అనుసరించాలని సీపీఐ కోరింది.

కులగణన, ఎన్నికల వ్యూహంపై చర్చకు
9న సీడబ్ల్యూసీ సమావేశం

న్యూదిల్లీ: కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ(సీడబ్ల్యూసీ) సమావేశం అక్టోబరు 9వ తేదీన జరుగుతుంది. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, కుల గణన, రానున్న ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సమావేశం చర్చలు జరపనున్నది. చత్తీస్‌గఢ్, రాజస్తాన్‌లలో తిరిగి అధికారం నిలబెట్టుకోవాలని, మధ్యప్రదేశ్‌లో బీజేపీ నుంచి, తెలంగాణలో బీఆర్ఎస్ నుంచి అధికారం కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ కోరుకుంటున్నది. అలాగే మిజోరంలోనూ మిజో నేషనల్ ఫ్రంట్(ఎంఎన్ఎఫ్) నుంచి అధికారం దక్కించుకోవాలని ఆశిస్తోంది. ప్రత్యేకించి దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న కులగణనపై దృష్టి సారించనున్నది. కులగణన జరిగి తీరాల్సిందేనని కాంగ్రెస్ ఇప్పటికే డిమాండ్ చేసింది. జనాభా ప్రాతిపదికన కులాలవారీగా ప్రజలకు లబ్ధి చేకూర్చాలని కాంక్షిస్తోంది. ప్రత్యేకించి ఇతర వెనుకబడిన వర్గాలు(ఓబీసీ)కు లబ్ధి కలిగించాలని డిమాండ్ చేస్తోంది. కొంతమంది ప్రతిపక్ష పార్టీల నాయకులు కేంద్ర దర్యాప్తు సంస్థల నుంచి సమస్యలు ఎదుర్కొంటున్న వేళ సీడబ్ల్యూసీ సమావేశం జరగడం ప్రాధాన్యత సంతరించుకుంది. వరుస అరెస్టుల జాబితాలో తాజాగా మద్యం కుంభకోణం కేసుకు సంబంధించి ఆప్ నేత సంజయ్‌సింగ్ చేరారు. ప్రభుత్వం లక్ష్యంగా చేసుకున్న ఆప్ ఎంపీ సంజయ్‌సింగ్, ఇతర ప్రతిపక్ష నేతలకు మద్దతుగా నిలవాలని కాంగ్రెస్ పార్టీ నిర్ణయం తీసుకుంది. సీడబ్ల్యూసీ పునర్వ్యవస్థీకరణ తర్వాత సెప్టెంబరు 16న మొదటి సమావేశం హైదరాబాద్‌లో జరిగింది. 9వ తేదీ సమావేశంలో ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, రానున్న లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై సుదీర్ఘంగా చర్చిస్తారు. ప్రస్తుత రాజకీయ పరిణామాలు, హైదరాబాద్ సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చించడానికి ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం సీడబ్ల్యూసీ సమావేశం జరుగుతుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు తెలిపాయి. రాజస్తాన్, చత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రులు కూడా హాజరవుతారు.

ఉద్యోగ, ఉపాధి కల్పనలో పాలకులు విఫలం

- నిరుద్యోగుల తిరుగుబాటు తప్పదు
- ఏఐవైఎఫ్ మాజీ నేత ఈశ్వరయ్య

విశాలాంధ్ర-విశాఖ: చదువుకున్న యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని, దేశ జనాభాలో 47 శాతం ఉన్న యువశక్తిని నిర్వీర్యం చేస్తున్నాయని ఏఐవైఎఫ్ మాజీ జాతీయ కార్యదర్శి జి. ఈశ్వరయ్య విమర్శించారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సమావేశం గురువారం విశాఖలోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన ఈశ్వరయ్య మాట్లాడుతూ ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని, దేశీయ సాంకేతిక పరిజ్ఞానంతో పరిశ్రమలు, ఉత్పత్తి కేంద్రాలు ఏర్పాటు చేస్తామని ప్రగల్భాలు పలికిన మోదీ ప్రభుత్వం...తొమ్మిదిన్నరేళ్లలో ఎన్ని ఉద్యోగాలు కల్పించిందో...ఎన్ని పరిశ్రమలు ఏర్పాటు చేసిందో చెప్పాలని ప్రశ్నించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించకపోగా... ఉన్న పరిశ్రమలను సంతలో సరుకులా అమ్మకానికి పెట్టిందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థల్ని అమ్మవద్దని ప్రజలు, ప్రతిపక్షాలు ఆందోళన చేస్తుంటే...వ్యాపారం చేయటం ప్రభుత్వం పని కాదని చెప్పటం సిగ్గుమాలిన చర్య అని దుయ్యబట్టారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అడగకుండా ఉండేందుకు కులం, మతం పేరుతో యువతను రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నదన్నారు. ఎంతోమంది త్యాగాల ఫలితంగా విశాఖ ఉక్కు పరిశ్రమ ఏర్పడిందని, 25 వేల ఎకరాలలో లక్షలాదిమందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు ఇస్తున్న విశాఖ ఉక్కు పరిశ్రమ విలువ నాలుగు లక్షల కోట్లు ఉంటుందని, అయితే దానిని తక్కువ ధరకు ప్రైవేటుకు ధారాదత్తం చేసేందుకు ప్రభుత్వం కుట్ర పన్నుతోందని విమర్శించారు. ఖాయిలా పరిశ్రమగా చూపడానికి విశాఖ ఉక్కు పరిశ్రమకు ముడిసరుకు నిలిపివేయటం, ఉద్యోగాలు భర్తీ చేయకపోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నదని, ఈ చర్యలను యువతరం తిప్పికొడుతుందని అన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ అమ్మకానికి వ్యతిరేకంగా అధికార, ప్రతిపక్ష పార్టీలు బీజేపీతో గట్టిగా పోరాటం చేయకపోవడం దుర్మార్గమన్నారు.

ఏఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్.లెనిన్‌బాబు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక నిరుద్యోగ యువత ఇతర దేశాలకు, రాష్ట్రాలకు వలసపోతున్నదని విమర్శించారు. ప్రభుత్వంలో దాదాపు 3 లక్షల ఉద్యోగాలు ఖాళీగా ఉన్నా...భర్తీ చేయకుండా యువతను మోసం చేస్తున్నదన్నారు. నిషేధిత మత్తు పదార్థాలు రాష్ట్రంలో విపరీతంగా దొరుకుతున్నాయని చెప్పారు. గంజాయి పండించడంలో, వాడకంలో దేశంలో మొదటి స్థానంలో రాష్ట్రం ఉండటం అత్యంత బాధాకరమని ఆవేదం వ్యక్తం చేశారు. ఏపీపీఎస్సీ 1, 2, 3, 4తో పాటు ఉపాధ్యాయ, అధ్యాపక ఉద్యోగాలు, ఇతర శాఖలలోని ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. విశాఖ ఉక్కు పరిశ్రమ పరిరక్షణ కోసం, కడప ఉక్కు సాధన కోసం, ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం యువత ఎదురుచూసి మోసపోయే పరిస్థితిలో లేదని, తిరుగుబాటుకు సిద్ధంగా ఉందన్నారు. సమావేశంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు పరుచూరి రాజేంద్ర బాబు, ఉపాధ్యక్షులు నాగరాముడు, సుబ్బారావు, సహాయ కార్యదర్శులు ద్రవిడ సురేశ్, కత్తి రవి, వై.బాబీ, యుగంధర్, కారుమంచి, విశాఖ జిల్లా కార్యదర్శి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆర్చరీలో పసిడి కాంతులు

స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్‌లో స్వర్ణం

హాంగ్జౌ: చైనా జరుగుతున్న ఆసియా క్రీడల్లో భారత ఆర్చర్లు అదరగొడుతున్నారు. గురువారం మహిళల కాంపౌండ్ ఆర్చరీ టీమ్ విభాగంలో భారత ఆర్చర్లు జ్యోతి వెన్నం, అదితి స్వామి, పర్నీత్ కౌర్ బృందం స్వర్ణ పతకం గెల్చుకున్నారు. ఇదే విభాగంలో పురుషుల జట్టు కూడా పసిడి పతకం గెలవడం విశేషం. ప్రవీణ్ ఒజాస్, అభిషేక్ వర్మ, ప్రథమేష్ సమాధాన్ జావ్‌కర్ బృందం దక్షిణ కొరియా జట్టుని 235-230 తేడాతో ఓడించింది. అంతకుముందు జరిగిన సెమీస్‌లో భారత బృందం చైనీస్ తైపీ జట్టుపై 234-224 తేడాతో గెలుపొంది ఫైనల్‌కు చేరింది. కాగా స్క్వాష్ మిక్స్‌డ్ డబుల్స్ ఫైనల్‌లో హరీందర్‌పాల్, దీపిక పల్లికల్ జంట మలేషియాపై 11-10, 11-10 తేడాతో గెలిచి పసిడి పతకాన్ని అందుకుంది. ఇక సీనియర్ స్క్వాష్ ప్లేయర్ సౌరభ్ ఘోషల్ పురుషుల సింగిల్స్‌లో రజత పతకం సాధించాడు. 37 ఏళ్ల సౌరభ్ ఫైనల్‌లో యియాన్ వో (మలేసియా) చేతిలో 11-9, 9-11, 5-11, 7-11 తేడాతో ఓటమిపాలయ్యాడు. తొలి గేమ్‌లో విజయం సాధించిన సౌరభ్... తర్వాత పట్టు తప్పి వరుసగా మూడు గేమ్‌ల్లో ఓడిపోవడంతో రజతంతో సరిపెట్టుకున్నాడు.

మహిళల హాకీలో నిరాశ

భారత మహిళల హాకీ జట్టు సెమీస్‌లో చైనా చేతిలో ఓటమిపాలైంది. భారత్ 0-4 తేడాతో ఘోర పరాజయం చవిచూసింది. దీంతో అక్టోబర్ 7న జరిగే కాంస్య పతక పోరులో జపాన్ లేదా దక్షిణా కొరియాతో తలపడాల్సి ఉంటుంది. మరో వైపు భారత పురుషుల కబడ్డీ జట్టు జైత్రయాత్ర కొనసాగుతోంది. గ్రూప్ దశలోని నాలుగు మ్యాచ్‌ల్లో విజయం సాధించి సెమీస్‌కు దూసుకెళ్లింది. జపాన్‌తో జరిగిన తమ చివరి గ్రూప్ దశ మ్యాచ్‌లో భారత్ 56-30 తేడాతో విజయం సాధించింది. శుక్రవారం జరిగే సెమీ ఫైనల్‌లో చిరకాల ప్రత్యర్థి పాకిస్తాన్‌తో తలపడనుంది.

రెజ్లింగ్‌లో మరో కాంస్యం

రెజ్లింగ్‌లో భారత్ ఖాతాలో మరో కాంస్య పతకం వచ్చి చేరింది. మహిళల 53 కిలోల విభాగంలో 19 ఏళ్ల అంతిమ్ పాంగల్ సంచలన విజయం సాధించింది. ఒలింపిక్ పతక విజేత అయిన బ్యాట్-ఓచిర్ బోలోర్టుయా (మంగోలియా)ను 3-1 తేడాతో ఓడించింది. ఈ ఆసియా క్రీడల్లో మహిళల రెజ్లింగ్‌లో భారత్‌కిదే తొలి పతకం. మరో కాంస్య పతక పోరులో భారత్‌కు నిరాశే ఎదురైంది. మహిళల 50 కేజీల విభాగంలో పుజా గెహ్లోట్ 2-9 తేడాతో అక్టెంగే కెయునిమ్జేవా (ఉజ్బెకిస్థాన్) చేతిలో ఓటమిపాలైంది. పురుషుల రెజ్లింగ్ కాంస్య పతక పోరులో నవీన్ కూడా పరాజయం పాలయ్యాడు. గ్రీకో రోమన్ (జీఆర్ 130 కేజీలు) విభాగంలో కిమ్ మిన్‌సోక్ (దక్షిణ కొరియా) చేతిలో 1-5 తేడాతో ఓటమి చవిచూశాడు.

భార్యకు బంగారు పతకం
దినేశ్ కార్తీక్ ఫుల్ ఖుష్

న్యూదిల్లీ: టీమిండియా క్రికెటర్ దినేష్ కార్తీక్ ఫుల్ హ్యాపీగా ఉన్నాడు. అతని భార్య, స్టార్ స్క్వాష్ ప్లేయర్ దీపికా పల్లికల్ ఆసియా క్రీడల్లో బంగారు పతకం సాధించింది. మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లో హరిందర్ పాల్ సింగ్ తో కలిసి బరిలోకి దిగిన దీపిక... ఫైనల్లో విజయం సాధించి స్వర్ణ పతకం గెలుచుకుంది. అయితే ఓవైపు క్రికెట్ వరల్డ్ కప్ 2023 కామెంటరీలో బిజీగా ఉన్న దినేష్ కార్తీక్ కు తన భార్య దీపికా పల్లికల్ ఫైనల్ గురించి ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందించారు హాంగ్జౌలో ఉన్న ఇండియా క్రికెటర్లు. ఆసియా క్రీడల్లో పాల్గొనడానికి సెకండ్ రేట్ ఇండియన్ టీమ్ చైనా వెళ్లిన విషయం తెలిసిందే. దీంతో రాహుల్ త్రిపాఠీ, వాషింగ్టన్ సుందర్ లాంటి వాళ్లు దీపిక మ్యాచ్ గురించి లైవ్ అప్డేట్స్ దినేష్ కార్తీక్‌కు అందించారు. ఈ స్క్వాష్ ఫైనల్ మ్యాచ్‌ను భారత జట్టు సభ్యులు ప్రత్యక్షంగా చూశారు. ఈ మ్యాచ్ లో దీపిక, హరిందర్ జోడీ అల్హా అజ్మన్, మహ్మద్ సయాఫిక్ జోడీపై 11-10, 11-0 తేడాతో విజయం సాధించింది. ఏషియన్ గేమ్స్‌లో దీపికకు ఇదే తొలి బంగారు పతకం ఇంతకు ముందు ఆమె ఒక రజతం, నాలుగు కాంస్య పతకాలు గెలుచుకుంది. ఈ మ్యాచ్ లైవ్ అప్డేట్స్ అందించినందుకు, విన్నింగ్ మూమెంట్‌కు సం బంధించిన వీడియో పంపినందుకు టీమ్ మేట్స్‌కు థ్యాంక్స్ చెబుతూ కార్తీక్ ఓ ట్వీట్ చేశాడు. 'థ్యాంక్స్ సుందర్, రాహుల్ త్రిపాఠీ, హర్ష, దీపికా, ఇండియా స్క్వాష్ టీమ్‌కు ప్రత్యక్షంగా వెళ్లి మద్దతు తెలిపారు. ఇది గొప్ప విషయం. అక్కడ లేకపోవడం బాధగా ఉంది. కానీ మీరు క్రికెట్‌లో బిజీగా ఉంటూనే అక్కడికి వెళ్లి లైవ్ చూసినందుకు సంతోషంగా ఉంది' అని కార్తీక్ అన్నాడు.

వేడుకలు లేకుండానే ప్రపంచకప్ ఆరంభం

- ఖాళీ కుర్చీలు.. స్టేడియం వెలవెల

అహ్మదాబాద్: ప్రపంచకప్ ఆరంభం అంటే ప్రారంభ వేడుకలపై అంచనాలు భారీగానే ఉంటాయి. ఆట పాటలు, సెలబ్రిటీల డ్యాన్స్‌లు, లైటింగ్స్, ఆకాశాన్ని తాకేలా బాణసంచాలు, స్టేడియం మొత్తం నిండిపోయిన అభిమానుల కేరింతలు... ఇలా సంబరాలు అంబరాన్ని అంటేలా ఉంటాయి. ఇక అలాంటిది వరల్డ్ కప్ భారత్‌లో జరిగితే... ఓపెనింగ్ మ్యాచ్ ప్రపంచంలోని అతిపెద్ద స్టేడియంలో నిర్వహిస్తే... ఆ సంబరాలు ఎలా ఉంటాయి. కానీ అవేవీ లేవు. అహ్మదాబాద్ లో జరుగుతున్న వరల్డ్ కప్ మొదటి మ్యాచ్ తూతూ మంత్రంగా ప్రారంభం అయింది. భారీ తారాగణంతో ఓపెనింగ్ సెర్మనీ ఉంటుంది అనుకున్న అభిమానులకు నిరాశ మిగిలింది. అందరి అంచనాలను తలకిందులు చేస్తూ మెగా టోర్నీ మామూలు మ్యాచుల్లా మొదలయింది. ఆరంభ మ్యాచ్ ను ప్రత్యక్షంగా చూసేందుకు నరేంద్ర మోదీ స్టేడియానికి భారీ సంఖ్యలో అభిమానులు వస్తారని ఊహించారు. అయితే అది కూడా జరగలేదు. మ్యాచ్ మొదలై రెండు గంటలు గడిచినా కూడా స్టేడియం మొత్తం ఖాళీ కుర్చీలే దర్శనమిచ్చాయి. విషయం తెలిసిన క్రికెట్ అభిమానులు నిరుత్సాహ పడుతున్నారు. అసలు ఇది వరల్డ్‌కప్ టోర్నీనేనా... మ్యాచ్ జరుగుతున్నది భారత్ లోనేనా అనే అను మానం వ్యక్తం చేస్తున్నారు. వరల్డ్‌కప్ గ్లోబల్ అంబాసిడర్ హోదాలో సచిన్ టెండూల్కర్ టోర్నీని అధికారికంగా ప్రారంభించాడనే మాట తప్ప... మిగతాదంతా నామ మాత్రంగా జరిగింది. దీంతో అభిమానులు పెదవి విరుస్తున్నారు. ప్రపంచంలోనే అత్యంత ధనిక క్రికెట్ బోర్డ్ అయిన బీసీసీఐ.. ఆరంభ వేడుక నిర్వహించలేనంత దుస్థితిలో ఉందా అని విమర్శిస్తున్నారు. అయితే అక్టోబర్ 14న జరిగే భారత్, పాకిస్తాన్ మ్యాచ్ ఈ ఆరంభ వేడుక ఉంటుందని కొందరు అంటున్నమాట. ఇది ఎంతవరకు నిజమో తెలియాల్సి ఉంది.

సెంచరీలతో చెలరేగిన కాన్వే, రచిన్

9 వికెట్లతో ఇంగ్లాండ్‌పై కివీస్ సంచలన విజయం

అహ్మదాబాద్: ప్రతిష్ఠాత్మక వన్డే ప్రపంచకప్ గురువారం ఇక్కడి నరేంద్రమోదీ స్టేడియంలో ఆరంభమైంది. తొలి మ్యాచ్‌లో గత ప్రపంచకప్ ఫైనలిస్టులు ఇంగ్లాండ్ - న్యూజిలాండ్ జట్లు తలపడగా... డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్‌పై న్యూజీలాండ్ 9 వికెట్ల తేడాతో సంచలనం విజయం నమోదు చేసింది. తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ 282 పరుగుల స్కోరు చేయగా ఈ లక్ష్యాన్ని కేవలం ఒకే ఒక్క వికెట్ కోల్పోయి ఆడుతూ పాడుతూ కేవలం 36.2 ఓవర్లలోనే ఛేదించింది న్యూజిలాండ్. ఓపెనర్ విల్ యంగ్ గోల్డెన్ డకౌట్ అయ్యాడు. అయితే డివాన్ కాన్వే, రచిన్ రవీంద్ర అజేయ సెంచరీలతో రెండో వికెట్‌కి 273 పరుగుల రికార్డు భాగస్వామ్యం నమోదు చేయడం ద్వారా కివీస్ ఘన విజయం అందించారు. వన్డే వరల్డ్ కప్‌లో న్యూజిలాండ్‌కి ఇదే అత్యధిక భాగస్వామ్యం. డివాన్ కాన్వే 121 బంతుల్లో 19 ఫోర్లు, 3 సిక్సర్లతో 152 పరుగులు చేశాడు. డివాన్ కాన్వేకి ఇది నాలుగో వన్డే సెంచరీ. తొలిసారి టాపార్డర్‌లో బ్యాటింగ్‌కి వచ్చిన రచిన్ రవీంద్ర 96 బంతుల్లో 11 ఫోర్లు, 5 సిక్సర్లతో 123 పరుగులు చేశాడు. ఇంగ్లండ్ ఇన్నింగ్స్‌లో ఒక వికెట్ కూడా పడగొట్టిన రచిన్ ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్‌గా ఎంపికయ్యాడు. తొలుత టాస్ ఓడి తొలుత బ్యాటింగ్ చేసిన ఇంగ్లాండ్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. జో రూట్ (77-86 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ శతకం బాదాడు. జోస్ బట్లర్ (43 - 42 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) రాణించాడు. జానీ బెయిర్‌స్టో (33), హ్యారీ బ్రూక్ (25), లియామ్ లివింగ్ స్టోన్ (20), అదిల్ రషీద్ (15లి), డేవిడ్ మలన్ (14), సామ్ కరన్ (14), మార్క్ వుడ్ (13లి), మొయిన్ అలీ (11) పరుగులు చేశారు. కివీస్ బౌలర్లలో మ్యాట్ హెన్రీ 3, గ్లెన్ ఫిలిప్స్ 2, మిచెల్ సాంట్నర్ 2, ట్రెంట్ బౌల్ట్, రచిన్ రవీంద్ర ఒక్కో వికెట్ తీశారు. తుంటి గాయంతో బాధపడుతున్న ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ ఈ మ్యాచ్‌కు దూరంగా ఉన్నాడు.

అజహరుద్దీన్‌పై అనర్హత వేటు

హైదరాబాద్: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ)ఎన్నికల్లో పోటీ చేయనీయకుండా భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ మహమ్మద్ అజహరుద్దీన్‌పై వేటు పడింది. ఈ మేరకు హెచ్‌సీఏ ఓటర్ల జాబితా నుండి అజహర్ పేరును తొలగిస్తూ జస్టిస్ లావు నాగేశ్వరరావు కమిటీ నిర్ణయం తీసుకుంది. ఈ కారణంగా ఇప్పుడు అజహర్ హెచ్‌సీఏ జరగనున్న ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హతను కోల్పోయాడు. అజహర్ గతంలో హెచ్‌సీఏ అధ్యక్షుడిగా ఉంటూనే డెక్కన్ బ్లూస్‌కు ప్రెసిడెంట్‌గా వ్యవహరించారని... అందుకే అనర్హత వేటు వేసినట్లు కమిటీ పేర్కొంది.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : R.V. RAMARAO. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2021-23, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.